

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు



సంపుటి : 14 | సంచిక : 03 | నవంబర్ 2008

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 32
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

హైదరాబాద్ ......... 23-09-08
గుండుగొలను ...... 09-03-08
శృంగవృక్షం .......... 01-10-08
జిన్నూరు .............. 09-10-08

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 23-09-08, హైదరాబాద్)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ ప్రపంచంలోనికి మనందరం వచ్చి ఎన్నో విషయాలు నేర్చుకొంటున్నాము. సైన్సుకు సంబంధించిన విషయాలు, లౌకిక విషయాలు ఇలా అనేక విషయాలు నేర్చుకొంటున్నాము కాని వాటితోపాటు మనలో ఉన్న అజ్ఞానాన్ని ఎలా పోగొట్టుకోవాలో నేర్చుకోవటంలేదు. మనలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించుకోవటానికే భగవంతుడు మనలను ఈ భూమిమీదకు పంపాడు. మనం వచ్చిన పని మర్చిపోయి, మిగిలిన విషయాలు ఎన్నో నేర్చుకొంటున్నాము. మనకు పొట్ట ఉంది కాబట్టి దానిని పోషించుకోవటానికి ఏవో విద్యలు నేర్చుకొంటున్నాము. అవన్నీ విద్యలే అయినప్పటికీ అవి అనిత్యమైన విద్యలు. ఆత్మవిద్య మాత్రమే నిత్యమైనవిద్య. నిత్యమైనవిద్య నేర్చుకోవటం వలన మన హృదయంలో ఉన్న నిత్యపదార్థం, సత్యపదార్థం మనకు అనుభవంలోనికి వస్తుంది. మనం ఈ భూమి మీదకు వచ్చాక శరీరం సుఖపడటానికి చాలా ప్రక్రియలు కనిపెడుతున్నాము. రైళ్ళు, విమానాలు కనిపెట్టాము పూర్వం ఆదిశంకరాచార్యులవారు భారతదేశం అంతా మూడుసార్లు కాలినడకన తిరిగారు, ఇప్పుడు మనం ఒక ఫర్లాంగు దూరం కూడా నడవలేకపోతున్నాము. ఆచార్యులవారు మన దేశంలోని అన్ని ప్రాంతాలకు వెళ్ళి మన సంస్కృతిపట్ల గౌరవం పెరిగేలా చేసారు, ఆయన బోధస్వరూపుడు. మనకు దైవభక్తిలేదు, దేశభక్తిలేదు. మన జాతీయగీతాలే మనకు రావు. మన దేశభక్తి స్థాయి అలా ఉంది. మన సంస్కృతి మీద మనకు గౌరవం ఉంటే మనకు దేశభక్తి వస్తుంది. దేశభక్తి

వలన మన హృదయం విశాలమవుతుంది. దేశం కూడా మనకు తల్లితో సమానము. మనకు కన్నతల్లి, స్వదేశం, పరాశక్తి అని ముగ్గురు తల్లులు ఉన్నారు. ముగ్గురు తల్లులు మనకు గౌరవనీయులే. మనకు తల్లిమీద, దేశం మీద, సంస్కృతిమీద గౌరవం లేదు. చైనా, జపాన్ దేశాలలో ఏదైనా వస్తువు తయారైతే దానిమీద వారి భాషలో జపాన్‌లో తయారయ్యిందని, చైనాలో తయారయ్యిందని వ్రాసుకొంటారు. మన దేశంలో తయారైన వస్తువులమీద మనం జాతీయభాష అయిన హిందీలోగాని, మన భాష అయిన తెలుగులో గానీ వ్రాసుకోవటం మానేసి ఇంగ్లీషులో వ్రాస్తున్నాము. సైన్స్, టెక్నాలజీలలో ఎంత అభివృద్ధి అయినా వారి సంస్కృతి, భాష, సాంప్రదాయాలమీద వారు గౌరవం విడిచిపెట్టలేదు. సైన్స్, టెక్నాలజీలలో అభివృద్ధి అయ్యాక మనం మన భాషను, సాంప్రదాయాన్ని మరిచిపోయాము. మన సంస్కృతి మీద మనకు గౌరవం ఉంటే అదే దేశభక్తిగా మారుతుంది.

నన్ను నేను ప్రేమించుకొంటాను, మిమ్మల్ని మీరు ప్రేమించుకొంటారు దానికి కారణం అక్కరలేదుకాని నేను మిమ్మల్ని ప్రేమించాలన్నా, మీరు నన్ను ప్రేమించాలన్నా కారణం ఉండాలి లేకపోతే ప్రేమించలేము. ఇది మన బుద్ధిలో ఉన్న దోషం, ఆ దోషాన్ని తొలగించుకోవటానికే మనం ఈ భూమిమీదకు వచ్చాము. ఈ ప్రపంచంలో మనం ఎంతో కాలం ఉండము. రానున్నది రాకమానదు, కానున్నది కాకమానదు, అది ఈశ్వరుడి నిర్ణయం. మన సంకల్పం అంటే మనందరకు ఇష్టం. మనకు భగవంతుడి సంకల్పం పట్ల గౌరవం లేదు. అనుకొనేది మన సంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. ఆ గోడ ప్రక్కన ఏముందో మనకు తెలియదు. ఈశ్వరుడు మనకంటే తెలివైనవాడు, సర్వజ్ఞుడు అన్న సంగతి మనం మరిచిపోయాము, దేవుడికంటే నేనే తెలివైన వాడిని అనుకొంటున్నాము, ఇదే మన అశాంతికి, దుఃఖానికి కారణం. మనకు తెలిసిన విషయాలు చాలా తక్కువ, తెలియని విషయాలు చాలా ఉన్నాయి. భగవంతుడికి తెలియని విషయం అంటూ ఏమీలేదు. భగవంతుడు ఈ తప్పు చేసాడు, ఆ తప్పు చేసాడు అని అంటాము. భగవంతుడు తప్పు చేయడు. భగవంతుడు చేసింది మనకు నచ్చక అలా అనుకొంటాము. ఈ జీవితంలో జరిగే సంఘటనకు మీ పూర్వజన్మకు ఏదో అనుబంధం ఉంటుంది. సంసారం అంటే ఇంట్లో మనుషులు సంసారం కాదు. పుట్టటం, చనిపోవటం అది సంసారం.

మీరు నన్ను మీటింగులు పెట్టి చెప్పమంటున్నారు, ఏమి చెప్పమంటారు? మౌనం బంగారం, మాటలు వెండి. మౌనంతో మీరు సంతృప్తి పడటం లేదు, మాటలు చెప్పండి

అంటున్నారు. నా దగ్గర ఒకే ఒక్క వాక్యం ఉంది చెప్పటానికి అంతకంటే ఏమీ లేదు. శరీరం సుఖపడటానికి మీరు అనేక ప్రక్రియలు చేసుకొంటున్నారు. శరీరం తాత్కాలికమే అయినా, శరీరం చనిపోయే వరకు అది ఉండాలి కనుక అది కంఫర్టుగా ఉండటానికి తగిన పనులు చేసుకొంటున్నారు, అది మంచిదే. నేను చెప్పేది ఒక్కటే. మీరందరు లోకంలో వస్తువులు, విషయాలు ఎలా సంపాదించుకొంటున్నారో అలాగే ఈశ్వరుని ప్రేమను, అనుగ్రహాన్ని సంపాదించుకోవటానికి ప్రయత్నం చేయండి, అంతకంటే చెప్పటానికి ఏమీలేదు. పరమేశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, ఆయన దయ ఉంటే మనకు అన్నీ ఉన్నట్లే. పరమేశ్వరుడి దయలేకపోతే నీకు బాహ్యంగా ఎన్ని ఉన్నా నీకు ఏమీ లేనట్లే. అందుచేత మనం అందరం కష్టపడి, నిరంతరం కృషిచేసి భగవంతుడి ఆశీస్సులు సంపాదించటం తప్ప మనకు ఇంకొక పనిలేదు, అదే ముఖ్యమైన పని. కాని మనం ఆ పని వదిలేసి మిగతా పనులన్నీ చూసుకొంటున్నాము. దాని వలన మరణానంతర జీవితంలో మనం చాలా నష్టపోతాము. తాత్కాలికంగా ఈరోజు గడిచిపోతే చాలు, ఈ జన్మ గడిస్తే చాలు అని ఇలా కురచగా ఆలోచిస్తున్నాము. కాని మనలో ఉన్న అజ్ఞానాన్ని ఎలా తొలగించుకోవాలి, వ్యక్తి భావనను ఎలా పోగొట్టుకోవాలి అవి మాత్రం నేర్చుకోవటం లేదు.

మన మనస్సు మంచిది కాదు అని అనుకోవటంకంటే దానిని బాగుచేసుకోవాలి. వేరుబుద్ధి నశించేవరకు మనకు ఏదో కోపం, కోరిక, అసూయ, ద్వేషం వస్తూ ఉంటాయి, ఇలా మన బుద్ధిని పాడుచేసుకొంటాము. మన బుద్ధిని బాగుచేసుకోవటానికి మనం ఈ లోకంలోనికి వచ్చాము. బాగా సారా తాగినవాడు కారును ఎలా నడుపుతాడో మన బుద్ధి పాడైపోతే అది మన శరీరాన్ని అలా నడుపుతుంది. మీరు ఒక్కరే ఒంటరిగా ఉన్నప్పుడు ఉన్నట్లుగా పది మందిలో ఉన్నప్పుడు ఉండరు, ఏవో బట్టలు సర్దుకొంటారు, అవి సర్దుకొంటారు. దానికి కారణం వారువేరు, మనంవేరు అని అనుకోవటం. ఆ వేరుబుద్ధి నశించేవరకు ఎవరికీ మోక్షంరాదు, శాంతిలేదు. ఎన్నికలలో కొంతమంది రాజకీయనాయకులు కోట్ల డబ్బు ఖర్చుపెట్టి బిందెలు, చీరలు, కుంకుమ భరిణలు ఇలా ఏవో పంచిపెడుతూ ఉంటారు, మనం వాటిని తీసుకొంటాము. అలా తీసుకొనేటప్పుడు వారు ఎందుకు పంచిపెడుతున్నారు అనే ఆలోచన మనకు ఉండదు, మనకు డబ్బే ప్రధానం, వారికి అధికారం ముఖ్యం. డబ్బు ఖర్చుపెట్టి అధికారంలోనికి వచ్చాక వాడు డబ్బు తినకుండా ఉండడు. వారు డబ్బు ఇచ్చేటప్పుడు మనం తీసుకొంటాము కాని వారు నీతిగా, నిజాయితీగా ఉండాలనుకొంటాము. వారు ఏదో పొరపాట్లు

చేస్తున్నారు అనుకొంటాము గాని మనది కూడా పొరపాటే. ఇవన్నీ ఎందుకు చెపుతున్నాను అంటే లోకానికి సంబంధించిన విషయాలలో కూడా మన జడ్జిమెంట్ సరిగా లేదు.

మనందరికి తలంపులు వేరు, ఆలోచనలు వేరు, వేరువేరుగా ఉన్నాము కాని భగవంతుడు అందరి హృదయాలలో చైతన్యముగా, ఆత్మగా ఉన్నానని చెప్పాడు, మన దేహాలు, మనస్సులు వేరుగా ఉన్న లోపల ఉన్న సద్వస్తువు ఒక్కటంటే ఒక్కటే. నాలో ఉన్నది నేనే, నీలో ఉన్నది కూడా నేనే అనే అనుభవం మనకు వచ్చేవరకు ఎంతమంది మహర్షులు, మహాత్ములు చెప్పినా మనకు భయం పోదు. బుద్ధి జడంలో నుండి రాలేదు, బుద్ధిని భగవంతుడు ఇచ్చాడు. భగవంతుడు ఇచ్చిన బుద్ధిని తిరిగి ఆయనలో ఐక్యం చేసేవరకు ఇలా శవాలను మోస్తూ ఉండవలసిందే, మరణించిన తరువాత పుణ్యలోకాలకో, పాపలోకాలకో కర్మానుసారం ప్రయాణం చేయవలసిందే. ఈశ్వరుడి పట్ల విశ్వాసం లేనప్పుడు, గౌరవం లేనప్పుడు ఆయన దయను సంపాదించటానికి మనం ఏమి ప్రయత్నం చేస్తాము. తపస్సు చేయకుండా మనలో ఉన్న దోషాలు బయటకు పోవు. వాక్కుతపస్సు, శారీరకతపస్సు, మానసికతపస్సు ఈ తపస్సులు అన్నీ భగవంతుడు చెప్పాడు. ఈ తపస్సుల వలన మన బుద్ధిలో ఉన్న దోషాలు బయటకు పోతాయి. తపస్సు లేనివాడు పతనమైపోతాడు. ఎవరైతే సాధన చేయకుండా లోకాభిరామాయణంతో సరిపెట్టుకొంటున్నారో వారు ఆ జన్మకు ఆ జన్మ పతనమైపోతారు, చనిపోయిన తరువాత చీకటిలోకాలు మిగులుతాయి. భగవంతుడు అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాడు. నీవు ప్రయత్నం చేయకుండా నీకు భగవదనుభవం కలుగదు. నిన్ను నీవు పాడుచేసుకోవద్దు, నిన్ను నీవు బాగుచేసుకో, ఎవరో వచ్చి నిన్ను బాగుచేస్తారని కనిపెట్టుకొని ఉండవద్దు.

శబరి పెళ్ళికి మాంసాహారంతో భోజనాలు పెట్టటానికి అన్నీ రెడీ చేస్తారు. ఈ హడావుడి ఏమిటి అని శబరి అడుగుతుంది. రేపు నీ పెళ్ళి కదా ఈ మేకలను, గొర్రెలను కోసి బంధువులకు భోజనాలు పెడతారు అని చెప్పారు. నాకు పెళ్ళి అయితే వాటి ప్రాణాలు తీయటం ఏమిటి అని శబరి అడుగుతుంది, ఇదేం పెళ్ళి అంటుంది. ఆ మేకలను, గొర్రెలను బతికించటంకోసం ఆ రాత్రి అందరూ పడుకొన్న తరువాత శబరి ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిపోతుంది. కొంతమందికి వాళ్ళ గురించి ఆలోచించుకోవటం ఎలాగో తెలియదు కాని ఇతరుల గురించి నిరంతరం ఆలోచిస్తారు. శబరి ప్రయాణం చేసి మాతంగమహర్షి ఆశ్రమం చేరుకొంది, పూర్వపుణ్యం ఆవిడను అలా తీసుకొని వచ్చింది. కొంతకాలం ఆ మహర్షికి సేవ చేస్తుంది. ఒకరోజు మాతంగముని శబరితో రేపు నేను వెళ్ళిపోతున్నాను అని చెపుతాడు. మీరు వెళ్ళే దగ్గరకి

నన్ను కూడా తీసుకొని వెళ్ళండి అంటుంది శబరి. నేను వెళ్ళేచోటు ఏ ఇద్దరూ కలిసి ప్రయాణం చేసేది కాదు అని మహర్షి చెపుతాడు. మరి నా మాట ఏమిటి అని శబరి అడుగుతుంది. నీవు పుణ్యాత్మురాలవమ్మా! నాకంటే నీవు అదృష్టవంతురాలవమ్మా! మేము భగవంతుడిని తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము, నువ్వు ప్రయత్నం చేయనక్కరలేదు దేవుడే నీ దగ్గరకు వస్తాడు, నువ్వు ఈ ఆశ్రమం విడిచిపెట్టి ఎక్కడకీ వెళ్ళవద్దు, భగవంతుడైన శ్రీరామచంద్రుడే స్వయంగా నీ దగ్గరకు వచ్చి నీకు మోక్షం ఇస్తాడు అని శబరితో చెపుతాడు. అది శబరి యొక్క పుణ్యం. పైకి శరీరం మామూలుగా మనకు కనిపిస్తుంది కాని లోపల ఉన్న నిర్మలత్వం, శాంతి, జ్ఞానం యొక్క వైభవం జ్ఞాననేత్రం ఉంటేనే కాని చూడలేము. మీలో హృదయసౌందర్యం ఉన్నప్పుడు చూసేశక్తి నాకు లేకపోతే అది నాకు కనబడదు. మీలో మంచి ఉందనుకోండి నాలో మంచి లేకపోతే మీలో ఉన్న మంచి నాకు కనబడదు మీలో ఏది ఉంటే అదే ఎదుటి వారిలో కనిపిస్తుంది. మీరు వేరు, నేను వేరు అనే వేరుబుద్ధితో ఉన్నంతకాలం మిమ్మల్ని చూసి నేను భయబడతాను, నన్ను చూసి మీరు భయపడతారు. మీరూ నేనూ ఒక్కటే, నాలో మీరు ఉన్నారు, మీలో నేను ఉన్నాను అని బుద్ధితో అర్థం చేసుకోవటంకాదు, అది అనుభవంలోనికి రావాలి. అవగాహన వలన పరమాత్మ అందడు, అనుభవం వలన పరమాత్మ అందుతాడు.

మనందరికీ యజమాని, మన కంట్రోలర్, మన నిజమైన భర్త సర్వేశ్వరుడు. ఆయన మనం ఒక్కటే అనే అనుభవం కలిగేవరకు మనలను దుఃఖం విడిచిపెట్టదు, అశాంతి విడిచిపెట్టదు. ఈశ్వరుడు మాట వదిలేయండి ఇక్కడ బాహ్యంగా ఉన్న మీ ఆయన మీరు ఒకటి అని అనుకోలేరు. ఆయన మీకు మధ్య తొంభై రహస్యాలు, ఎవరి ప్రోపర్టీ వారిది, ఎవరి మేనేజ్‌మెంట్ వారిది. మీ ఆయన మీరు ఒకటే అని అనుకోనప్పుడు పైనున్న ఆయన అంటే ఈశ్వరుడు మీరు ఒక్కటే అనే భావన ఎలా కలుగుతుంది, ఆ భావన రానేరాదు. నీ దేహయాత్రకు సరిపడ వ్యవసాయమో, ఉద్యోగమో ఏదో ఒక కృషి చేసుకొంటూ, ఏ విషయంలోను అతిగా ఉండకుండా, మధ్యే మార్గంలో ప్రయాణం చేస్తూ మిగతా కాలం అంతా నా నామాన్ని స్మరిస్తూ, నారూపాన్ని ధ్యానిస్తూ, నాలో ఐక్యం అవ్వటానికి ప్రయత్నం చెయ్యి. అంతకంటే మించిన పని ఏముంది అంటున్నాడు పరమాత్మ. నీవు వేరు, నేను వేరు అని బుద్ధిలో స్థిరపడిపోయింది. నీ బుద్ధికి సార్థకత రావాలంటే నీవు ఏమి చేయాలి అంటే నన్ను నిరంతరం స్మరిస్తూ, నన్ను ధ్యానం చేస్తూ నాలో ఐక్యం అవ్వాలి, అలా ఎప్పుడైతే

ఐక్యం అయ్యావో అప్పుడు నీకు, నాకు బేధం లేదు అని నీకు తెలుస్తుంది. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే నన్ను శరణు వేడుకో, నేను ఉన్నాను అని పూర్తిగా విశ్వసించు, నా అనుగ్రహాన్ని సంపాదించటానికి ప్రయత్నం చెయ్యి, నేను ఏదైతే వద్దని చెప్పానో అది మానెయ్యి, నేను చెయ్యమని చెప్పినపని చెయ్యి, చెయ్యకూడనిది చెయ్యటం ఎంతపొరపాటో, చేయవలసిన డ్యూటీ మానెయ్యటం కూడా అంతే పొరపాటు అని చెప్పాడు. భగవంతుడు మీకు కేటాయించిన పనిలో నుండి తప్పించుకొంటే, భగవంతుడు సర్వజ్ఞుడు కదా, రాబోయే జన్మలలో మిమ్మల్ని శరీరమనే కట్రాడుకు కట్టేసి, మీరు తప్పించుకొన్న పనిని వడ్డీతో సహా మీ చేత చేయిస్తాడు, ఈశ్వరుడిది బలీయమైన శక్తి. మనందరం ఏవో అనుకొంటూ ఉంటాము, అనుకొన్నవి అన్నీ జరగటం లేదు. మనమే ఈశ్వరుడైతే అనుకొన్నవి ఎందుకు జరగటం లేదు. కర్మఫలితం జీవుడి చేతిలో లేదు. జీవుడు పని చేయటానికే పనికివస్తాడు కాని ఫలితం ఇచ్చేవాడు పరమేశ్వరుడు. పని నేను చెయ్యాలా, ఫలితం ఈశ్వరుడు ఇస్తాడా అని మొత్తం పని చేయటం మానివేయవద్దు. బాహ్యంగా మీ శరీరానికి ఎన్ని సదుపాయాలు ఉన్నా అవి సైన్సుకి, టెక్నాలజీకు సంబంధించినవి. అవి మీ శరీరాన్ని సుఖపెట్టవచ్చుగాని మీకు శాంతిని ఇవ్వలేవు, మీకు మోక్షాన్ని ఇవ్వలేవు. జ్ఞానం తాలుక అనుభవం ఎప్పుడైనా మీ హృదయంలోనే స్ఫురిస్తుంది.

మాకు జ్ఞానేంద్రియాలు ఉన్నాయి, కర్మేంద్రియాలు ఉన్నాయి వీటిలో ఏ ఇంద్రియం ద్వారా కూడా పొరపాటు జరగకుండా ఉండేలా మమ్మల్ని ఆశీర్వదించు అని కొంతమంది రోజూ సూర్యుడు ఉదయించగానే ఆయనను ప్రార్థిస్తారు. ఇంద్రియాల ద్వారా పొరపాట్లు జరుగుతూ ఉంటే హృదయంలో ఉన్న ఈశ్వరుడు మనకు అనుభవంలోనికి రాడు. నువ్వు నేనై ఉన్నాను, అది నీకు తెలియటం లేదు, అందుకే జన్మలు నిన్ను వెంటాడుతున్నాయి. ఆయనే నేను అని నోటితో చెప్పకోవటంకాదు, ఆ అనుభవం హృదయంలో రావాలి. నన్ను చూసి నాకు కోపం రాదు, ద్వేషం రాదు. మిమ్మల్ని చూస్తే నాకు కోపం వస్తుంది, ద్వేషం వస్తుంది. ఇదంతా ద్వైతబుద్ధిలోనుండి వస్తోంది. ఈ ద్వైతబుద్ధిని, వేరుబుద్ధిని నశింపచేసుకోవటానికి మనం చేసే ప్రయత్నంలో ఒక భాగమే ఈ సత్సంగాలు. ఈ జన్మలో అయినా, రాబోయే జన్మలో అయినా ఈ ద్వైతబుద్ధిని అతిక్రమిస్తేనేగాని మనకు మోక్షసుఖం దొరకదు. మీకు చెప్పేది ఏమిటి అంటే మీ దైనందిన జీవితంలో మీ పనులు మీరు చేసుకొంటూ, మీకు చేతనైనంత వరకు ఇతరులకు సహాయం చెయ్యండి. నీవు ఇతరులకు ఏదైనా సహాయం చేస్తే అది తిరిగి నీకే వస్తుంది, అది

తెలియక ఇతరులను ఏదో ఉద్ధరించాను అని నీవు అనుకొంటావు. భగవంతుడు మనకు బుద్ధిని ఇచ్చాడు. ఎవడైతే మనకు బుద్ధిని ఇచ్చాడో, ఈ బుద్ధి వెళ్ళి ఆయనలో ఐక్యం అవ్వాలి, అదే మన కడసారి జన్మ. ఒకోసారి భగవంతుడు మనలను కష్టాలకు గురి చేస్తాడు. భగవంతుడు ఇలా చేస్తున్నాడు ఏమిటి అని మనం అనుకొంటాము. మన బుద్ధిలో ఉన్న దోషాలను కక్కించటానికే భగవంతుడు అలా చేస్తాడు. ప్రతీ మనిషికి కొన్ని సంఘటనలు పెట్టి వాడి మనస్సును ఇరుకున పెట్టి నొక్కి దానిలోని దోషాలను బయటకు లాగి మనస్సును శుభ్రం చేస్తాడు. మనలను పవిత్రం చేయటానికే భగవంతుడు ఇవన్నీ చేస్తున్నాడు అని మనకు తెలియటంలేదు. భగవంతుడికంటే మన క్షేమం కోరేవారు ఎవరూ లేరు.

ఈ జీవకోటికి అంతకు పరమేశ్వరుడే భర్త. మన దేహాలతోగాని, మనస్సుతోగాని, ఇంద్రియాలతోగాని సంబంధంలేకుండా అందరి హృదయాలలో ఆయన ఆత్మగా ఉన్నాడు. మీకు లోచూపు కలిగితే, మీరు హృదయంలోనికి వెళ్ళి చూస్తే మీ ఆయన అంటే ఈశ్వరుడు, మీరు ఒక్కటే అని మీకు తెలుస్తుంది. అప్పటివరకు వేరుబుద్ధి ఎవరినీ విడిచిపెట్టదు. మన మనస్సు చలించకుండా ఉండటంకోసం జపం, ధ్యానం, యోగాభ్యాసాలు ఇలా ఏవో ప్రక్రియలు చేస్తున్నాము. రాగద్వేషములు లేకపోతే మన మనస్సును చలించమని అడిగినా అది చలించదు. ఏ హృదయగుహలో అయితే పరమేశ్వరుడు ఉన్నాడో అక్కడకు నిన్ను తోలుకొని పోయేవాడే గురువు. మీకోరికతో, మీ తలంపుతో సంబంధం లేకుండా మీ పని నెరవేర్చేవాడే నిజమైన గురువు. తలంపును కూడా రానివ్వడు, తలంపు రాకపోతే శక్తి వృధా అవ్వదు. మీకు కొన్ని కోరికలు నెరవేరతాయి, కొన్ని కోరికలు ఎంత ప్రయత్నం చేసినా నెరవేరవు. కొన్ని కోరికలు నెరవేరి, కొన్ని కోరికలు ఎందుకు నెరవేరటం లేదో భగవంతుడికి తెలుసు, ఆయన సర్వజ్ఞుడు. ఆ కోరికలు కూడా నెరవేరితే మీరు భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను పతనమౌతారు అందుకే ఆ కోరికలు నెరవేరకుండా ఆపుచేస్తాడు అంతేగాని మీ మీద ఇష్టం లేకకాదు. ఈ మధ్య ఒక పెద్ద మనిషి ఏమని చెపుతున్నాడు అంటే నేను డబ్బు ప్రసాదించమని భగవంతుడిని అడిగితే ఆయన ప్రసాదించలేదు. అప్పుడు నా ఆర్థిక పరిస్థితి తక్కువగా ఉండేది, పేకాట ఆడేవాడిని. నెమ్మదిగా పేకాట ఆడటం మానేసాను, అప్పుడు భగవంతుడు డబ్బు ప్రసాదించాడు. ముందే ఆయన డబ్బు ప్రసాదించి ఉంటే బాగా పేకాట ఆడి పాడైపోయేవాడిని, అందుచేత పేకాట మానేసాక ఆయన డబ్బు ప్రసాదించాడు, ఇదంతా భగవంతుడి కరుణ అంటున్నాడు. ఈశ్వరుడు ఎందుకు చేస్తున్నాడో, ఆయన ఎందుకు

చేయటం లేదో మనం ప్రశ్నించకూడదు. ఆయన ప్రణాళికను బట్టి అది జరుగుతుంది. ఏ సంఘటన జరిగినా అది మన మంచికోసమే చేస్తున్నాడు అనే విశ్వాసం ఈశ్వరుడిపట్ల మనకు ఉండాలి. లోపల ఉన్న ఈశ్వరుడిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి శరీరం, మనస్సు ఫిట్ అవ్వాలి. మనందరము కావలసిన దానికంటే ఎక్కువగా తింటున్నాము. దాని వలన మనకు అనారోగ్యం, ఇంకొకరు తినే ఆహారం తగ్గిపోతుంది. ఎక్కువ తినటం వలన తమోగుణం వస్తుంది. ఆకలి అనే రోగానికి సరిపడ ఆహారం పెట్టు అని ఆచార్యులవారు చెప్పారు. శరీరం నిలబడటానికి సరిపడ ఆహారం పెట్టు, ఎక్కువ ఆహారం తినటం వలన బలం రాదు, శారీరక ఆరోగ్యం పాడైపోతుంది. శరీరానికి అవసరమైనదే తిను అంతేగాని రుచికోసం ఎక్కువ తినకు. రుచికోసం తినటం మొదలుపెడితే మనస్సు బాహ్యముఖానికి పోతుంది. మనస్సును కూడా ఎంతవరకు ఉపయోగించాలో అంతవరకే ఉపయోగించాలి కాని ఎక్కువ ఉపయోగిస్తే పిచ్చివాడవు అయిపోతావు. వ్యవహారాలలో కూడా అతిగా వెళ్ళకూడదు, మధ్యే మార్గం మంచిది. శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకొంటే శరీరం ఉన్నా శరీరం లేనివాడితో సమానము, మనస్సు ఉన్నా మనస్సు లేనివాడితో సమానము.

బయట వారి మీద కేకలు, ఇంట్లో వారి మీద కేకలు వేయటానికి మనకు సిగ్గు ఉండదు. భగవంతుడి నామం గట్టిగా చెయ్యటానికి మనకు సిగ్గు. మనం భగవంతుడిని స్మరించకపోతే ఆయనకు ఏమీ నష్టం లేదు, భగవంతుడి నామాన్ని స్మరించటం వలన మనం పవిత్రులమవుతాము. మన దేహం చనిపోయినప్పుడు కుటుంబ సభ్యులతో, స్నేహితుల తోటి సంబంధం తెగిపోతుంది కాని గురువుతో ఉన్న సంబంధం మాత్రం తెగదు. గురువు మీలో నిజమైన ఆత్మగా ఉన్నాడు. గురువు ఏ స్థాయిలో ఉన్నాడో ఆ స్థాయిని పొందేవరకు వేటగాడు జంతువును వేటాడినట్లు గురువు జన్మజన్మలకీ మిమ్మల్ని వెంటాడుతూ ఉంటాడు. గురువు అంటే మీకు ఒకోసారి ఇష్టం ఉండవచ్చు, ఒకోసారి ఇష్టం లేకపోవచ్చు. గురువును మీరు ఎన్నుకొంటే గురువును మారుస్తూ ఉంటారు కాని గురువే మిమ్మల్ని ఎన్నుకొన్నప్పుడు మీరు గురువును మార్చలేరు. గురువే మిమ్మల్ని తన ఒడిలోకి తీసుకొన్నప్పుడు మీరు తరించే వరకూ బాధ్యత గురువుదే. నీ మనస్సును నాకు అర్పించమని భగవంతుడు అడుగుతున్నాడు. మన మనస్సును బాగుచేయటానికే, మనపట్ల దయచూపించటానికే మన మనస్సును అడుగుతున్నాడని తెలియక పోవటం వలన గురువుని, దేవుడిని తిడతాము. మన ఇంట్లో

వారు పరాయివారు కాని గురువు మాత్రం పరాయివాడు కాదు, ఆయన మన హృదయంలో సజీవమైన సత్యముగా ఉన్నాడు. మీరు శరీరాన్ని శుభ్రంగా ఉంచుకొంటున్నారు కదా అలాగే ఏదైనా మాట్లాడేటప్పుడు, పనిచేసేటప్పుడు మీ సంకల్పం శుద్ధిగా ఉండాలని భగవంతుడు చెపుతున్నాడు. మీరు మాట్లాడే మాట వెనకాల, ఆలోచన వెనకాల, పని వెనకాల సంకల్పం ఉంటుంది, ఆ సంకల్పం శుద్ధిగా ఉంటే భగవంతుడి దయ కలుగుతుంది, అంతకంటే మీకు ఏమి కావాలి. మీ సంకల్పం సరిగా ఉంటే నూటికి తొంభై పనులు సక్రమంగానే జరుగుతాయి. పునాదిలో తేడా ఉంటే మేడ ఎంతకాలం ఉంటుంది అలాగే మీ సంకల్పం సరిగా లేనప్పడు మీరు సాధన చేసిన సక్సెస్ అవ్వలేరు. మీ సంకల్పం శుద్ధిగా ఉంటే ఇంపెర్సనల్ బిహేవియర్ వస్తుంది, ఈగోలెస్ బిహేవియర్ వస్తుంది. ఎవడైతే కోరికను, కాలాన్ని జయించాడో వాడు పరమేశ్వరుని స్వరూపాన్ని పొందుతాడు. కొంతమంది మాకు కాలక్షేపం అవ్వటంలేదు అంటారు. అంటే వారు కాలాన్ని జయించలేదు అని అర్థం. మీకు ఆత్మ నిష్ట కుదిరితే వంద సంవత్సరాలు వంద క్షణాల కింద వెళ్ళిపోతాయి అదీ కాలాన్ని జయించటం అంటే.

అహంభావన పోగొట్టుకోవాలి అని పెద్దలు చెపుతున్నారు కాని అది ఎలా పోగొట్టుకోవాలో తెలియటం లేదు అంటున్నారు. మనం ఈశ్వరుడి ప్రణాళికలో ఒకభాగం కింద ఉండాలి కాని వ్యక్తి కనబడకూడదు. మనం ఎంతసేపు వ్యక్తి కనబడటానికి చూస్తాము, దానివలన అహంభావన పెరిగిపోతుంది. మనస్సును కంట్రోలు చేసుకోవటం వలన వచ్చే ఆనందాన్ని తట్టుకోలేకపోతున్నాను మీరేమో ఎయిమ్‌హై అంటున్నారు, గమ్యాన్ని మర్చిపోవద్దు అంటున్నారు, మరి ఏమి చేయమంటారు అని అడుగుతున్నారు. మీరు హైదరాబాద్ మీటింగుకోసం వచ్చారు, మధ్యలో మీ చుట్టాల ఇంటికి, స్నేహితుల ఇంటికి వెళితే వారు ఏమైనా బహుమతులు ఇవ్వవచ్చు అవి చూసి మీటింగుకు రావటం మానెయ్యరు కదా. అలాగే మీరు సాధన చేసేటప్పుడు కొన్ని అనుభవాలు కలుగుతాయి, మహిమలు రావచ్చు వాటి దగ్గర ఆగిపోవద్దు. అజ్ఞానాన్ని తొలగించుకోవటానికి ఈ భూమి మీదకు వచ్చాము, వచ్చిన పని మర్చిపోకూడదు. మీ హృదయంలో సత్యం ఉంది. అది మీరై ఉన్నారు. అక్కడకు చేరుకోవటానికి భగవంతుడు శరీరమనే అవకాశాన్ని ఇచ్చాడు, దానిని మనం మేగ్జిమమ్ ఉపయోగించుకోవాలి. అసలు మనం చేసే కృషి చేస్తూ ఉంటే, మన సంకల్పం మంచిది అయితే, మనం చేసే ప్రయత్నం డివోటెడ్‌గా చేస్తూ ఉంటే మీరు తొందర పడనక్కరలేదు, కాలం కలిసి వస్తుంది, మీరు పొందవలసింది పొందుతారు. ఏ కాలంలో ఏది జరగాలో

అది జరిగిపోతుంది. అదృష్టమైన, దురదృష్టమైన, శరీరానికి సంబంధించిన చావు అయినా అది రావలసిన టైముకే వస్తుంది. మనం నేను, నేను అంటాము. పండితులకు, పామరులకు, ధనవంతులకు, పేదలకు అందరికీ ఈ నేను అంటేనే ఇష్టం. ఇది మిథ్యానేను. ఈ మిథ్యానేను మీద ఇష్టం తగ్గితేనే గాని నిజమైన నేను తెలియదు. నిజమైన నేనుకు, మిథ్యానేనుకు తేడా చెప్పాలి. అంటే మనిషికూడా నీడ ఉంటుంది కదా అలాగే నిజమైననేనుకి మిథ్యానేను నీడలాంటిది. మనం ఆ నీడను పట్టుకొని నిజమైననేనును విడిచిపెట్టేస్తున్నాము. మిథ్యా నేనును విడిచిపెడితేనే గాని అసలు వస్తువు నీకు ఎరుకలోనికి రాదు. మనలను ఏదైతే పాడుచేస్తోందో అదంటేనే మనకు ఎక్కువ ఇష్టం, దానిని చూసి పొంగిపోతున్నాము, ఆ పొంగును ఆపుచెయ్యి. నేను పుడుతున్నానని, నేను చనిపోతున్నానని శరీరం అనుకోదు, శరీరం లోపల ఉన్న జీవుడు అనుకొంటున్నాడు. అలా అనుకొనేవాడు ఎవడు అని విచారణ చెయ్యి. నీకు ద్వయీభావం ఉండకూడదు. నీ హృదయంలో సత్యం ఉంది. ఉన్నదంతా నీ హృదయంలోనే ఉంది. నీ దేహం ఎంత నిజమో, మనస్సు ఎంత నిజమో బయట గొడవలు కూడా అంతే నిజం. నీ హృదయంలో ఉన్న సత్యంలో స్థిరపడే వరకు నీవు సాధన కొనసాగించు, ఈలోపు సంతోషం వచ్చిందని, దుఃఖం వచ్చిందని, రోగాలు తగ్గించే మహిమలు వచ్చాయని ఇటువంటి చిల్లర గొడవల దగ్గర ఆగవద్దు. నీ గమ్యాన్ని మర్చిపోవద్దు. నీవు శాస్త్రాన్ని అనుసరించి జీవించు. ఏది మంచి ఏది చెడు, ఏది నిత్యం ఏది అనిత్యం అని నిర్ధారణ చేసేటప్పుడు కేవలం నీ బుద్ధి మీద ఆధారపడకు, శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకొని నిర్ణయం చేసుకో అని పరమాత్మ చెపుతున్నాడు.

మీకు ఎప్పుడైనా శాంతి వస్తోంది అనుకోండి, దానికి కారణం ఏమిటి అని చూసుకోవాలి. కారణం కనిపిస్తే మీకు వచ్చిన శాంతి నిజంకాదు. మనం భగవంతుడిని ఎలా ప్రేమిస్తే ఆయన దయకు పాత్రులవుతాము అంటే ఆయన దగ్గరనుండి స్వర్గంకాని, ఈలోకానికి సంబంధించిన వైభవం కాని ఏమీ కోరుకోకూడదు, అయినా ఈశ్వరుని పాదాలపట్ల భక్తి, ప్రేమ కనుక ఉంటే ఆయన అనుగ్రహం మన శిరస్సు మీద వర్షింపచేస్తాడు. ఫలానా కారణం వలన మనకు ఈశ్వరుడి మీద ప్రేమ కలిగిందని భౌతికకారణం కనబడితే మీరు అవుటైపోతారు. ఈశ్వరుడి మీద అకారణమైన ప్రేమ, అకారమైన భక్తి ఉంటే ఈశ్వరుని దయకు పాత్రులవుతాము. ఈశ్వరుని దయను సంపాదించటం కంటే మించినది ఏముంది? మరణానంతర జీవితంలో వచ్చేది అదే. కార్లు, విమానాలు ఇవి అన్నీ మీ శరీరాన్ని సుఖపెట్టే యంత్రాలు, మరణానంతర జీవితంలో

ఇవి ఏమీ మీ కూడా రావు. శరీరం బతికి ఉన్నంతకాలం శరీరానికి ఎన్ని సౌఖ్యాలు కావాలో అన్నీ సమకూర్చుకొనే మనం, మరణానంతరం పనికొచ్చేది ఏమీ చేయొద్దా అనేది ఇక్కడ ప్రశ్న. శరీరం సుఖంగా ఉండటంకోసం డబ్బు ఖర్చు పెట్టి బజారులలో తిరిగి ఇన్ని వస్తువులు కొనుక్కొంటున్నాము కదా మరి మరణానంతర జీవితంలో కూడా సుఖంగా, శాంతిగా ఉండటానికి మనం ఏమి చేయాలి అనే ఆలోచన మనకు రావటం లేదు. మంచి పనులు చేసేవారు కూడా ఏదో పుణ్యం వస్తుందని, స్వర్గలోకానికి వెళదామని ఆలోచించేవారేగాని ఈశ్వరుడిలో ఐక్యం అవ్వటానికి మనం చేసే ప్రయత్నం ఏమీ లేదు. ప్రియ, అప్రియములను విడిచిపెట్టమని భగవంతుడు చెపుతున్నాడు. మీ శ్రేయస్సు కోరేవాడు చెపుతున్నాడు కనుక ప్రియ, అప్రియములను విడిచిపెట్టాలి. వాటిని విడిచిపెట్టేటప్పుడు మనకు బాధ కలుగుతుంది ఎందుచేతనంటే ఒకప్పుడు అవి మనలను సుఖపెడతాయని వాటిని పెంచుకొన్నాము కనుక ఇప్పుడు వాటిని విడిచిపెట్టేటప్పుడు మనకు బాధ కలుగుతుంది. ఆత్మజ్ఞానం సంపాదించుకోవటానికి అడ్డువస్తున్నాయి కనుక మనం వాటిని విడిచి పెట్టాలి.

దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టు, అది ఏ పనిమీద వచ్చిందో ఆపని చేసుకొని వెళ్ళిపోతుంది. ప్రారబ్దంలో ఉన్న చెడ్డను పాయసం నోట్లో పోసుకొన్నట్లు అనుభవించు. అయ్యోపాపం చెడు ప్రారబ్దం వచ్చినా వీరు చాలా సహనంగా అనుభవిస్తున్నారు, భగవంతుడి సంకల్పాన్ని గౌరవించాలని అనుభవిస్తున్నారు అని ఆయనకు మీ మీద దయ కలిగి రాబోయే జన్మలో అటువంటి ప్రారబ్దాన్ని మీకు ఇవ్వడు అది భగవంతుడు చేసే మేలు. మాకు సందేహాలు వస్తున్నాయి, మాకు భయం వస్తోంది అంటారు ఎవరికి సందేహాలు వస్తున్నాయి? ఎవరికి భయం వస్తోంది? ఈ వికారాలు అన్నీ ఎవరికి వస్తున్నాయి? అని వాడిని విచారణ చేసి బోను ఎక్కించండి, వాడిని తొలగించుకోండి. వాడిని ఎలా తొలగించుకోవాలో నేర్పించేవాడే గురువు. అజ్ఞానం యొక్క చేష్టలు ఎలా ఉంటాయో మీకు తెలియజేసి వాటిలో నుండి ఎలా తప్పకోవాలో మీకు నేర్పించి, అజ్ఞానం నుండి బయటపడేలా చేసేవాడే స్పిరుట్యువల్ గురువు. మంచితనమే జ్ఞానం అంటాడు సోక్రటీసు. లోకం కోసం మంచివారుగా ఉండటం కాదు, ఎదుటివారు చెప్పకోవటంకోసం మంచి వారుగా ఉండటం కాదు, చరిత్రలో వ్రాయించుకోవటానికి మంచివారుగా ఉండటం కాదు, మంచి కోసమే మంచివారుగా ఉండండి. మీకు ఉన్న మంచితనం నిజమైతే ఆ మంచితనమే హృదయగుహలో ప్రవేశించటానికి మీకు సహాయ సహకారములు అందిస్తుంది. మాయ ఈశ్వరుడి చేతిలో

ఉంటుంది. మంచికోసమే మంచిగా ఉండేవారికి ఈశ్వరుడు మాయతో చెప్పి మాయ చేత దారి ఇప్పిస్తాడు, అప్పుడు ఈశ్వరుడిలో ఐక్యమవుతాము.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 09-03-08, గుండుగొలను)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

గాంధీగారు జీవితానుభవంలో ఒక ముఖ్యమైనమాట వ్రాసారు. సంతోషాలు వెంటాడుతున్నా, దుఃఖాలు వెంటాడుతున్నా ఈశ్వరుడికి మనం ఎంత శరణాగతి చేస్తే అంత శాంతిని, సుఖాన్ని పొందుతున్నట్లు గ్రహిస్తున్నాను అని తన జీవితంలో నేర్చుకున్న పాఠాలలో గాంధీగారు వ్రాసుకొన్నారు. జీవులలో బహుత్వం ఉంది, దేవతలలో బహుత్వం ఉంది కాని ఈశ్వరుడిలో బహుత్వం లేదు. రాముడు, కృష్ణుడు, శంకరుడు, అల్లా, యెహోవా ఇలా అనేక రూపాలలో ఉన్నా భగవంతుడు ఒక్కడే, మతాలను బట్టి పేర్లు మారుతున్నాయి కాని ఉన్నవాడు ఒక్కడే. నేను కోరికలను నెరవేర్చుకోవటానికి ఈ భూమి మీదకు రాలేదు, ఏ పరమాత్మ అయితే నన్ను ఈ భూమి మీదకు పంపాడో ఆయన సంకల్పాన్ని నెరవేర్చటానికి ఈ భూమి మీదకు వచ్చాను అన్నాడు ఏసు. సముద్రానికి భిన్నంగా బుడగలు లేవు. ఈశ్వరుడికి భిన్నంగా జీవులు లేరు. మనందరం ఈశ్వరుడిలో నుండే వచ్చాము, ఈశ్వరుడిలోనే జీవిస్తున్నాము, ఈశ్వరుడిలోనే లయం అయిపోతాము. భక్తిలో ద్వైతం ఉంది కాని శరణాగతిలో ద్వైతం లేదు. భక్తిలో నీవు ఉంటావు, భగవంతుడూ ఉంటాడు కాని శరణాగతిలో జీవుడు ఉండడు, భగవంతుడే ఉంటాడు, ఆయన సంకల్పమే మన సంకల్పం. మనకు ఇష్టం ఉన్నా, లేకపోయినా జరిగేది ఈశ్వర సంకల్పమే. ఈశ్వర సంకల్పానికి ఎదురు ఈదటం అంటే రోడ్డు రోలరు కింద తలకాయ పెట్టటమే. జీవులు ఎవరూ స్వతంత్రులు కాదు, సృష్టి అంతా ఈశ్వరుని స్వాధీనంలో ఉంది. భగవాన్ తల్లికి చెప్పిన మొదటి సందేశం ఇదే. ఈశ్వరుడు జీవులను వారి వారి ప్రారబ్ధం ననుసరించి ఆడిస్తున్నాడు, జరుగవలసింది జరిగే తీరును, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసిననూ జరుగనే జరుగదు అని చెప్పారు. ఇది నోటితో చెప్పకోవటం తేలిక, అనుభవానికి రావాలంటే చాలా అభ్యాసం అవసరం. ఈ శరీరమే నేను, ఈ శరీరం నాది అనే జీవుడికే సంతోషాలు, దుఃఖాలు వస్తాయి. ఈ సంతోషాలు, దుఃఖాలు, స్వర్గం, నరకం, అదృష్టం, దురదృష్టం వీటినన్నింటిని అనుభవించేవాడు జీవుడే. నేను, నాది అనే జీవుడు ఈ శరీరాన్ని ఖాళీ చేసి వెళ్ళిపోతే అప్పుడు ఎవరైనా

సంతోష పెట్టాలన్నా సంతోషపెట్టలేరు, దుఃఖపెట్టాలన్నా దుఃఖపెట్టలేరు.

మాకు దిక్కు లేదు, మమ్మల్ని చూసేవారు ఎవరూ లేరు అని చాలామంది అంటూ ఉంటారు. అలా అనటం అపచారం ఎందుచేతనంటే మనందరికి దేవుడే దిక్కు. ఆ ఎరుక మనకు లేకపోవటం వలన మన బంధువులు, స్నేహితులు మనకు దిక్కు అనుకొంటున్నాము. మనకు నిజమైన స్నేహితుడు, నిజమైన బంధువు, నిజమైన భర్త, ఈ శరీరం ఉన్నా లేకపోయినా మన యోగక్షేమములు చూసేవాడు ఈశ్వరుడు ఉండగా మనలను ఎవరూ చూడటం లేదు అనుకొంటే అది ఆయనను అవమానపరచినట్లు అవుతుంది. శరీరం వచ్చింది అంటే దుఃఖం వచ్చినట్లే. ఈలోకం దుఃఖాలయం అని పరమాత్మ గీతలో చెప్పాడు. ఒకవేళ నీవు ఈ లోకంలో భోగాలు అనుభవిస్తున్నా, అవి సంతోషంగా ఉన్నా పరిణామంలో అవి దుఃఖంగా మారిపోవును ఎందుచేతనంటే ఆ భోగాలు, సుఖాలు నిజంకాదు. ఈ శరీరం తోటి, ఈ లోకంతోటి, చావు పుట్టుకలతోటి, రాగద్వేషములతోటి సంబంధం లేకుండా పరమాత్మ మన హృదయంలో ఉన్నాడు. ఆయనతో జతచేస్తే ఈ గొడవలన్నీ పోతాయి. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే సజీవమైన విశ్వాసం నీకు ఉంటే హృదయంలో భగవంతుడి యొక్క స్పర్శ నీకు తెలుస్తుంది, భౌతికమైన స్పర్శకంటే బలీయంగా తెలుస్తూ ఉంటుంది. ఊరిలో అనేక గొడవలు జరుగుతూ ఉంటాయి, ఆ విషయాలు మీరు వినకూడదు, ఒకవేళ విన్నా ఇతరులకు చెప్పకూడదు. లోకవిషయాల వలన భక్తి చెడిపోతుంది. భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకొని మనం జీవించాలి. మీకు ఎంతోకొంత చిత్తశుద్ధి లేకపోతే, పవిత్రత లేకపోతే, నిదానం లేకపోతే మీకు ఏది కావాలో, మీకు ఏది మంచిదో కూడా మీకు తెలియదు అని పరమాత్మ చెపుతున్నాడు. అన్నీ మాకు తెలుసు అని కొంతమంది అంటారు. అన్నీ మీకు తెలిస్తే భగవంతుడు గీత చెప్పటం ఎందుకు. మన మనస్సుకు, ఇంద్రియాలకు అందని అనేక విషయాలు భగవంతుడు గీతలో చెప్పాడు. మనకు చిత్తశుద్ధి లేకపోవటం వలన గీత మనకు సరిగా అర్ధం కావటం లేదు. బ్రాహ్మణుడిలో, కుక్కలో, కుక్క మాంసం తినేవాడిలో, అన్ని జీవరాశులలో అంతర్యామిగా ఉన్న భగవంతుడినే చూడు అంతేగాని బయట గొడవలు వద్దు. అంతర్యామిగా ఉన్న భగవంతుడిని చూసే స్థాయికి మీరు ఎదగకపోతే మీ పతనాన్ని మీరే కొనితెచ్చుకొంటారు.

నాకు పునర్జన్మ రాకుండా చేసుకోవాలంటే ఏదైనా ఉపాయం ఉందా అని ప్రశ్న. ఆత్మ ఒక్కటి అంటే ఒక్కటే, దానికి ద్వితీయం లేదు. మంచి, చెడు, పుణ్యాలు, పాపాలు ఇవన్నీ

అహంకారానికి సంబంధించిన విషయాలు. మీకు దేహం మీద అభిమానం ఉంది కనుక దేహానికి అనుకూల సంఘటనలు జరిగితే పొంగిపోతారు, ప్రతికూల సంఘటనలు జరిగితే కుంగిపోతారు. మీకు ఏదైనా అదృష్టం వస్తే మాకు రోజులు బాగున్నాయి అనుకొంటారు అనుకోండి మీరు పనికిరారు అని మట్టిలో కలిపేస్తాడు. ప్రతికూల సంఘటనలు జరిగితే కుంగిపోతున్నారు అనుకోండి, ఇంక మీరు పనికిరారు అని మట్టిలో కలిపేస్తాడు అంటే పునర్జన్మలోనికి పంపేస్తాడు. నీ దేహంతోటి, లోకంతోటి, కుటుంబ సభ్యులతోటి, బాహ్య పరిస్థితులతోటి సంబంధం లేకుండా నీవు స్వతంత్రమైన సుఖాన్ని, ఆనందాన్ని అనుభవిస్తూ ఉంటే ఇంక నీవు పునర్జన్మలోనికి రావలసిన పనిలేదు. నీ స్నేహితులు, బంధువులు, కుటుంబ పరిస్థితుల వలన వచ్చే సుఖం వలన నీవు పునర్జన్మలలో కొట్టుకొని పోవలసిందే. వ్యక్తిగతమైన పుణ్యాలు పాపాలు, లాభాలు నష్టాలు ఇవన్నీ వ్యక్తి ఎంత నిజమో అవి కూడా అంతే నిజం. పుణ్యం సుఖాన్ని తీసుకొని వస్తుంది, పాపం దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. ఇవన్నీ వ్యవహారిక సత్యాలు, అసలు సత్యానికి వీటికి ఎట్టి సంబంధం లేదు. నీవు అనుభవించే సంతోషానికి ప్రకృతి గొడవలతో ఏమాత్రం అనుబంధం ఉన్నా పునర్జన్మలలో కొట్టుకొని పోతావు. రిలేషన్‌లెస్ హేపీనెస్, రిలేషన్‌లెస్ పీస్ అక్కడికి ఎదిగిరా అప్పుడు నీవు పునర్జన్మల నుండి విడుదల పొందుతావు. మీ అబ్బాయి పని, అమ్మాయి పని బాగుంది అని పొంగిపోతారు అనుకోండి, లేకపోతే మీ సంసారం బాగాలేదు అని కుంగిపోతారు అనుకోండి ఇవి ఏమీ నిజంకాదు. వారు నావాళ్ళు అనుకోవటం వలన ఇదంతా వస్తోంది.

పరిస్థితులు అనుకూలంగా ఉంటే పొంగిపోవటం, ప్రతికూలంగా ఉంటే కుంగిపోవటం మానకపోతే కోటిజన్మలు ఎత్తినా దేహాభిమానంలో నుండి విడుదల పొందలేరు. నీకు ఇష్టం ఉన్నా లేకపోయినా ఇది నగ్న సత్యం. మీకు ఎప్పుడైనా శాంతి వస్తోంది అనుకోండి దానికి కారణం చూసుకోండి. బాహ్య కారణాల వలన వచ్చే సుఖంగాని, శాంతిగాని నిజంకాదు, అది నిలబడదు. భీష్ముడు అంపశయ్యమీద ఉన్నప్పుడు కర్ణుడు చూడటానికి వెళ్ళి నమస్కారం పెడతాడు. అప్పుడు భీష్ముడు కర్ణుడిని దగ్గరకు పిలిచి అయిపోయిందేదో అయిపోయింది, ఇప్పుడు నీవు పాండవులకు సహాయం అందిస్తే మంచిది అని చెపుతాడు. అప్పుడు కర్ణుడు భీష్ముడితో ఏమన్నాడు అంటే ఈ సృష్టి అంతా ఈశ్వరుడి స్వాధీనంలో ఉంది, ఆయన సంకల్పమే నెరవేరుతుంది, నేను ఎంత గొప్ప వీరుడినైనా నన్ను బట్టి పాండవులు ఓడిపోరు. ఈశ్వరుడు వారి తరపున ఉన్నాడు. ఈశ్వరసంకల్పం ముందు నా తెలివితేటలు, వీరత్వం ఎందుకు పనికి వస్తాయి అంటాడు. అంటే తాతగారు మీ కోరికే నెరవేరుతుంది అని చెప్పకుండా చెప్పటం.

ఈశ్వరుడు పనిచేస్తున్నాడు కాని అది మన కళ్ళకు కనబడటంలేదు, మనస్సుకు అందటంలేదు కనుక ఆయన పని చేయటం లేదు అనుకొంటున్నాము. ఈశ్వరుడు పని చేస్తున్నాడు అని గుర్తింపు వచ్చాక ఈశ్వరసంకల్పమే నెరవేరుతుందనే భావన మనకు కలుగుతుంది. ఈశ్వర సంకల్పమే జరుగుతుంది అనే భావన మనకు ఎప్పుడైతే గుర్తింపుకు వచ్చిందో అప్పుడు మనకు దుఃఖం నశిస్తుంది. కొంతమంది నేను అనటానికి సిగ్గుపడతారు. ఈ దేహం ద్వారా జరుగవలసి ఉంది జరిగింది అంటారు కాని నేను అది చేసాను, నేను ఇది చేసాను అని చెప్పరు. ఎవరైనా 'నేను' అని ఎక్కువగా వాడుతూ ఉంటే అసలు నువ్వు ఉన్నావని నీకు ఎవరు చెప్పారు అనేవారు భగవాన్. నిజంగా నీవు ఉంటే ఈశ్వరుడిని కాదని, ఈశ్వర సంకల్పానికి భిన్నంగా నీవు ఏదైనా చేయగలవా? నీ వలన ఏమీ కాదు. కామరాజ్ నాడార్ పూర్వం మద్రాసు ముఖ్యమంత్రి చేసాడు, చాలా మంచివాడు, గొప్ప నాయకుడు అయినా ఒక సామాన్యుడి చేతిలో ఓడిపోయాడు, కాలం వచ్చేటప్పటికి ఎంతటి వాడైనా అంతే. మీకు పునర్జన్మ రాకూడదు అంటే ఎవడికైతే చావు పుట్టుకలు లేవో వాడితో జత కట్టండి, వాడు ఎక్కడో లేడు మీ హృదయంలోనే ఉన్నాడు. వాడిని పూజించండి, వాడితో కలిసి ఉండండి, వాడిలో ఐక్యమైతే వాడికి చావు పుట్టుకలు లేవు కనుక మీరు కూడా ఆ స్థితిని పొందుతారు. మీ దేహం ఈశ్వర సంకల్పం ప్రకారం ఏ రోజు ఎక్కడ ఉండాలో అక్కడ ఉంటుంది, ఆ దేహం ద్వారా జరుగవలసింది జరిగిపోతూ ఉంటుంది. మనకు దేహాభిమానం ఉంది కనుక దేహానికి వచ్చే మంచి చెడులు నాదే అనుకొంటున్నారు. నాకు 70 సం॥లు వచ్చినాయి అంటారు, మీకు 70 సం॥లు రావటం కాదు, మీ శరీరానికి 70 సం॥లు వచ్చాయి. ఈ దేహం ఉండగానే దేహాభిమానం పోగొట్టుకొంటే దేహం ప్రారబ్దం ప్రకారం నడుచుకొంటూ పోతుంది, దాని తాలుక సంతోషం, దుఃఖం మిమ్మల్ని ముట్టుకోవు, ఇంక ప్రారబ్దం మిమ్మల్ని ఏమి చేయలేదు. దేహం ఉండగానే జీవలక్షణాలు లేనిస్థితిని పొందితే ఇంక సంతోషానికి, దుఃఖానికి అతీతమైపోతారు. ఒకవేళ జన్మలు ఉన్నా అవన్నీ అబద్ధం, ఈ జన్మ ఎంత అబద్ధమో రాబోయే జన్మ కూడా అంతే అబద్ధం. ఈ అబద్ధాలు గురించి చెప్పకోవటం ఎందుకు అనేవారు భగవాన్. నీ హృదయంలో ఉన్న భగవంతుడిని చేరుకొనే వరకు ఇవన్నీ నిజం కింద అనిపిస్తాయి, అక్కడికి వెళ్ళాక ఇవేమీ నిజంకాదు.

మనకు చిత్తశుద్ధి లేకపోవటం వలన భగవంతుడు చెప్పిన మాటలను నమ్మలేక పోతున్నాము. చిత్తశుద్ధి లేకుండా హృదయంలో ఉన్న నిజమైన స్నేహితుడి దగ్గరకు వెళ్ళలేము.

ఇష్టాలు, అయిష్టాలు అంటూ ప్రత్యేకంగా లేవు. నీ వ్యక్తిభావన ఇష్టంగా, అయిష్టంగా మారుతోంది. విషయాలకు అసలు బలం లేదు. నీవు వాటి గురించి ఆలోచించటం వలన వాటికి బలం పెరుగుతోంది. నేను అనే తలంపు, నాది అనే తలంపు అజ్ఞాన జనితములు. ఈ రెండు తలంపులలో నుండి విడుదల పొందకపోతే నిజమైన శాంతి కలుగదు. ఈ రెండు తలంపుల నుండి విడుదల పొందటమే మన జీవిత లక్ష్యం, అది మనం మర్చిపోతున్నాము. గాఢ నిద్రలో నీకు బాహ్యమైన గొడవలు ఏమీ లేవు. గాఢనిద్రలో నుండి జాగ్రదవస్థలోనికి రాగానే మొదట నేను అనే తలంపు వస్తుంది, నేను అనే తలంపు వచ్చాక జన్మల గొడవలు, పుణ్యపాపాలు, రాగద్వేషాలు, స్వపర బేధం ఇవన్నీ కూడా వస్తాయి. ఏది వచ్చాక ఇవన్నీ వస్తున్నాయో అది ఎంత అబద్దమో దాని వెనకాల వచ్చే ఇవన్నీ కూడా అంతే అబద్ధం, ఆ క్లూ మీరు పట్టుకోవాలి, లేకపోతే ఈ ప్రవాహంలో నుండి బయటకు రాలేరు.

మీరు అందరూ వ్యక్తిగతమైన పుణ్యపాపాల గురించి, బలహీనతల గురించి ఆలోచిస్తున్నారు. వ్యక్తి ఎంత అబద్దమో ఇవన్నీ కూడా అంతే అబద్ధం. ఈ నాన్సెన్స్ గొడవలలోనికి వెళితే మీరు ఒడ్డుకు రాలేరు. అది చెప్పటానికి వచ్చిన అవతారమే రమణావతారం. గుడిలోనికి వెళ్ళి అష్టోత్తరం చేయించుకొని పుణ్యం వచ్చేస్తుంది అనుకొంటారు. అష్టోత్తరం చేసేవాడు జీవుడే, చేయించుకొనేవాడు జీవుడే, దాని వలన పుణ్యం వస్తే అది అనుభవించేవాడు జీవుడే. శరీరమే ఉండనప్పుడు పుణ్యపాపములు ఏమి నిలబడతాయి. ఈ గొడవలలో ఉంటే ఇంక హృదయంలో ఉన్న నిజమైన స్నేహితుడి దగ్గరకి వెళ్ళే ప్రయత్నం ఎప్పుడు చేస్తారు. మీరు వంద కారణాల వలన ఇబ్బందులు పడుతున్నా, దుఃఖపడుతున్నా మీకు సబ్జక్టు ప్రోపర్‌గా అర్థమైతే వంద కారణాలు కూడా కాలి బూడిద అయిపోతాయి. నీవు గుర్తించినా, గుర్తించకపోయినా ఈశ్వరుడు పని చేస్తున్నాడు. ఈశ్వరుడు పనిచేస్తున్నాడు అనే గుర్తింపు కలిగి ఉంటే నీకు ఉన్న అశాంతి నెమ్మదిగా కాలిపోతుంది. నిజమైన నేను నీ హృదయంలో ఉంది, ఉంటే సరిపోదు, ఆ 'నేను' నేనని నీకు తెలియాలి. 'నేను' నేనై ఉన్నానని దాని తాలుక గుర్తింపు నీకు రావాలి. అప్పటివరకు నిన్ను జన్మలు విడిచిపెట్టవు, అశాంతి విడిచిపెట్టదు. మరణసమయంలో జీవుడు శరీరాన్ని విడిచిపెట్టేటప్పుడు బాధపడతాడు. దేహము నేను అనే భావనతో అనుభవించిన భోగాలు, కోరికలు, వాసనలు ఇవన్నీ లోపల ఉంటాయి, అవి శరీరాన్ని విడిచిపెట్టటానికి చాలా బాధ పడతాయి. గాఢనిద్రలో ఈ శరీరం కొంతటైము ఎలా రెస్టులో ఉంటుందో అలాగే ఈ జన్మకి మరల జన్మకు మధ్య ఈ జీవుడు

కొంత రెస్టులో ఉంటాడు. మీకు ఏ కోరికలు తీవ్రంగా ఉన్నాయో వాటిని నెరవేర్చుకోవటానికి అనుగుణమైన శరీరాన్ని ఈ జీవుడికి భగవంతుడు ఇస్తాడు, అదే పునర్జన్మ.

రామకృష్ణ పరమహంసగారి దగ్గరకు కొంతమంది వచ్చి కాశీలో రేవు కట్టించాము, అక్కడ గుడి కట్టించాము అని చెపుతూ ఉంటే దేవుడిని తెలుసుకోవటం కంటే నీకు ఇవి గొప్పగా ఉన్నాయా అనేవారు. ముందు దేవుడిని తెలుసుకొనే పని చెయ్యి తరువాత రేవులు, సత్రాలు కట్టించవచ్చు, వాటికి చాలా టైము ఉంది అనేవారు. మనం చెప్పకొనే సబ్జక్టు ఒక కులానికి, మతానికి సంబంధించినది కాదు. దేహం భోగవస్తువు కాదు, సాధనవస్తువు అన్నారు భగవాన్. మనకు ఎంతసేపు చనిపోయే వరకు ఏమి సుఖాలు అనుభవించాము, ఏం భోగాలు అనుభవించాము ఇదే గొడవ. ఇంక వేరే పని మనకు ఏమీ లేదు. మనం ప్రతీదీ భోగదృష్టితో ఆలోచిస్తున్నాము. దీనివలన దేహాభిమానం పెరిగిపోతుంది. ఈ దేహాన్ని సాధనా వస్తువు కింద మనం తీసుకొంటే ఇంక మనకు దేహం రాదు. ధాన్యాన్ని మిల్లులో పట్టిస్తే పై పొర పోయి బియ్యం అవుతుంది. అలాగే నీవు సాధన చేసి అహంకారం అనే పొరను తీసివేస్తే లోపల ఉన్న బ్రహ్మం నీకు వ్యక్తమవుతుంది అన్నాడు రామకృష్ణుడు. ధాన్యం అనుకొన్నప్పడు కూడా బియ్యమే. నీవు జీవుడు అనుకొన్నప్పడు కూడా బ్రహ్మమే. ఉన్నదేదో అలాగే ఉంది, నీవు అనుకొన్నట్లుగా అది లేదు. ఈ ప్రపంచం మీకు ఎంతో అందంగా విలాసంగా కనిపిస్తుంది. పామును ముట్టుకొంటే మెత్తగా ఉంటుంది కాని దాని నోటినిండా విషమే ప్రపంచం కూడా అటువంటిదే అన్నారు శ్రీకృష్ణ చైతన్య. భగవంతుడు చెప్పిన మాటలను శ్రవణం చేసి, మననం చేసి ముఖ్యమైన మాటలను ధారణ చేయాలి. ధారణ చేయటం వలన అది మన రక్తంలో రక్తం, మాంసంలో మాంసం కింద అయి మన గుండెను పట్టుకొంటుంది.

ఈ కాలాలు, దూరాలు, దేశాలు ఇవన్నీ అబద్ధం అంటున్నారు భగవాన్. గాఢనిద్రలో కాలం, దూరం, దేశం, కష్టాలు, నష్టాలు ఇవి ఏమీ లేవు. ఇవన్నీ నీవు కల్పించుకొన్న గొడవలు. ఒక కెనడా దేశస్థుడు నాన్నగారి వెబ్సైట్ చూసి నాన్నగారిని చూడటానికి వస్తాను అనేవాడు. ఇప్పడు ఏమంటున్నాడు అంటే వెబ్సైట్లో మీ మాటలు విని, విని మిమ్మల్ని చూడాలి అనుకొనేవాడు ఇప్పడు కనబడటం లేదు అంటున్నాడు. ఇది అద్భుతం. ధారణ చేయగా చేయగా సబ్జక్టు ముగింపుకు వస్తుంది, ఇంక వాడికి శారీరక శ్రమ అక్కరలేదు, డబ్బు ఖర్చు లేదు. లోపలఉన్న శాంతి వాడికి దొరికినప్పడు ఇంక రాకలేదు, పోకలేదు, బాహ్యంగా

కష్టపడవలసిన పని ఇంకవాడికి లేదు. పునర్జన్మ అంటే ఈ దేహంలో నుండి ఇంకొక దేహంలోనికి వెళ్ళటం కాదు. జీవలక్షణాలు పోవాలి, ఆత్మలోనికి మేల్కోవాలి. ఈ శరీరం ఉండగానే శరీరం నేను, శరీరం నాది అనేవాడు చనిపోవాలి. ఆత్మజ్ఞాన సముపార్జనకు ఆటంకాలుగా ఉన్న నీ బలహీనతలను తొలగించుకొంటే లోపల ఉన్న సత్యంలో మేల్కొంటావు. అది దేహం ఉండగానే జరిగిపోవాలి. దేహం ఉండగానే నీవు చనిపోవాలి, మరల అదే దేహంలో పుట్టాలి, అది నిజమైన పునర్జన్మ. ఏసుక్రీస్తును ఎలా శిలువ వేసారో అలాగ దేహము నేను అనే భావనను శిలువ వేస్తే నీకు నిజమైన పునర్జన్మ వస్తుంది. నిజమైన స్నేహితుడు నీ హృదయంలోనే ఉన్నాడు. వాడితో జతకట్టటమే నీవు చేయవలసిన పని, అక్కడికి మేల్కోవటమే నీవు చేయవలసిన పని. వాడు ఉన్నాడని నమ్మకం నీకు లేనప్పుడు వాడితో ఎలా జత కడతావు. నీవు ఏదిగా ఉన్నావో ఆ ఆనందప్రవాహంలో, జ్ఞానగంగలో మునిగే వరకూ దేహభావన నిన్ను విడిచిపెట్టదు. కాశీ వెళ్ళి గంగలో మునగటం తేలికేగాని జ్ఞానగంగలో మునగటం చాలా కష్టం. జ్ఞానగంగలో మునగటానికి సాధన చేయాలి, సాధన కోసమే ఈ దేహాన్ని ఉపయోగించుకోవాలి.

కొంతమందికి అసంగబుద్ధి ఉంటుంది. అంటే డ్యూటీ చేస్తారు కాని ఇంట్లో వారి మీద కూడా మోహం పెట్టుకోరు. తిలక్‌గారు పత్రిక నడిపేవారు. ఒకసారి ఆయన ఆఫీసులో కూర్చొని పత్రికకు ఎడిటోరియల్ వ్రాస్తూ ఉండగా మనవడికి ఆరోగ్యం బాగాలేదని కబురు వచ్చింది. అప్పుడు తిలక్‌గారు మా మనవడికి బాగాలేదు మా ఇంటికి వెళ్ళి వైద్యం చేయండి అని డాక్టరుకు కబురు చేస్తే డాక్టరు వెళ్ళి వైద్యం చేసేసరికి ఆ పిల్లవాడు చనిపోయాడు. తిలక్‌గారు పని పూర్తిచేసుకొని వెళ్ళేసరికి మనవడు చనిపోయాడు. ఇంట్లోవారికి తిలక్‌గారి మీద కోపం వచ్చింది. అప్పుడు తిలక్‌గారు ఏమన్నారు అంటే ఆరోగ్యం బాగాలేకపోతే వైద్యం చేస్తాడని డాక్టరును పంపాను కదా, నేను వచ్చి వైద్యం చేయను కదా, నేను రావటం వలన అక్కడ పని చెడిపోతుంది కదా అన్నారు. అది అసంగబుద్ధి. అంటే చేయవలసిన డ్యూటీ చేసారు కాని మోహం పెట్టుకోలేదు. బాహ్యజీవితం ముఖ్యం కాదు. దేహం ఉండగానే లోపల ఉన్న పునర్జన్మ హేతువులు కాలిపోవాలి, అప్పుడు ఇంకవాడికి పునర్జన్మ లేదు, దేహం ఉండగా పునర్జన్మ కారణాలు కాలి బూడిద అవ్వకపోతే దేహం చనిపోయాక జీవుడు ప్రయాణం చేసేస్తాడు. మీకు చావు, పుట్టుకలు ఇష్టం లేదు అనుకోండి. చావు పుట్టుకలు లేనివాడు మీ లోపల ఉన్నాడు వాడితో జత కట్టండి. ఒక గుడ్డివాడు ఇంకో గుడ్డివాడిని ఆశ్రయించినట్లు

ఈ చనిపోయేవారితో ఏమి జతలు కడతారు. ఒకపూట తిండి లేక మీరు బాధపడుతున్నారు అనుకోండి, రెండుపూటల తిండి లేనివాడి దగ్గరకు వెళ్ళి నాకు అన్నం పెట్టు అంటే ఆ మాటకు అర్థం ఉందా. మనమే దరిద్ర్యంతో బాధపడుతూ ఉంటే మనకంటే దరిద్రులతో మీకు స్నేహాలు ఏమిటి అంటున్నారు భగవాన్.

మన క్షేమం కోరేవాడు, మనలను ప్రేమించేవాడు మన హృదయంలోనే ఉండగా మాకు దిక్కు లేదు అనుకొంటే లోపల ఉన్న ఈశ్వరుడిని అవమానపరచినట్లు అవుతుంది. దేహం చనిపోయినా నీ హృదయంలో ఉన్న జతగాడికి చావులేదు. వాడే నీవన్న సంగతి నీకు తెలియక నేను చనిపోయాను అనుకొంటున్నావు. హృదయంలో ఉన్న జతగాడే నీవు అన్న సంగతి నీకు తెలిసేవరకూ మహాత్ములతోటి, సత్పురుషులతోటి సహవాసం చెయ్యి. నీకు తెలియకుండానే వారు నీ అజ్ఞానానికి నిప్ప పెడతారు, అది లోపల తగలబడుతూ ఉంటుంది. నీవు ఇచ్చే పుష్పాలను, పండ్లను గురువు ఎంతో ప్రీతితో ప్రేమతో తీసుకొంటాడు. ఎందుకు ప్రీతిగా తీసుకొంటాడు అంటే గురువుగారు ఎంతో ప్రీతిగా తీసుకొంటున్నారని ఎప్పటికైనా నీ మనస్సు అనే పుష్పాన్ని ఇస్తావని అలా చేస్తూ ఉంటాడు. బాహ్యమైన పుష్పాలు ఇవ్వటం వలన నీ దుఃఖం పోదు, మనస్సు అనే పుష్పాన్ని గురువుకు సమర్పిస్తే నీ దుఃఖం నశిస్తుంది. గురువు నీకు వేరుకాదని, అయనే నీవని అప్పడు నీకు తెలుస్తుంది అది నీ కడసారి జన్మ.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 01-10-08, శృంగవృక్షం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అమ్మవారు అంటే శక్తి. శక్తి లేకపోతే మనం ఏపని చేయలేము. అమ్మ అనుగ్రహం లేకపోతే మనకు జ్ఞానం రాదు అని చెపుతారు. అందుచేత అమ్మవారిని ప్రత్యేకంగా పూజిస్తారు. రావణాసురుడితో యుద్ధానికి వెళ్ళేముందు రాముడు కూడా అమ్మవారిని పూజించి వెళ్ళాడు. యుద్ధానికి ముందు అమ్మవారికి పూజ చేసి రండి, ఆ శక్తే లేకపోతే మనం యుద్ధం చేయలేము, ఆవిడ అనుగ్రహం లేకుండా ఏ పని చేయలేము అని కృష్ణుడు పాండవులకు చెపుతాడు. దేహభావన ఉన్నవారు అందరూ ఆడవాళ్ళే. మన అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నవాడే పురుషుడు. ఆయనే మన ప్రభువు, ఆయనే మన భర్త. మన ఇంట్లో ఉన్న భర్త వ్యవహారికం. మన శరీరం ఎంత నిజమో ఆయన శరీరం కూడా అంతే నిజం. మన మనస్సు ఎంత నిజమో ఆయన మనస్సు కూడా అంతే నిజం. ఇవి అన్నీ

సంసారం గొడవలు. మన శరీరం ఎలా చనిపోతుందో ఆయన శరీరం కూడా అలాగే చనిపోతుంది. మన నిజమైన భర్త మన హృదయంలోనే ఉన్నాడు. ఈ చనిపోవటాలు, పుట్టటాలు, ఈ ప్రకృతి గొడవలతో ఆయనకు ఏమీ సంబంధం లేదు. ఇది చాలా మందికి అర్థం కాదు. అమ్మవారి దయ లేకుండా అర్థం చేసుకొనే బుద్ధి మనకు రాదు. మనకు ఇష్టం లేకపోతే భార్యలో నుండి భర్త విడిపోవచ్చు, భర్తలోనుండి భార్య విడిపోవచ్చు కాని మన నిజమైన భర్తలో నుండి మనం విడిపోవాలన్నా విడిపోలేము. మనం అబద్ధంలోనుండి విడిపోగలము గాని నిజంలో నుండి ఎలా విడిపోతాము. టెన్నీసన్ ఏమన్నాడు అంటే ఇక్కడ మీరు అందరూ కూర్చొని ఉన్నారు కదా, మీరందరూ ఉన్నారా అన్నాడు. అదేమిటి మీరు కనిపిస్తున్నారు కదా మరి ఉన్నారా అని అడగటం ఏమిటి అని మరల ఆయనే అన్నాడు. మీరు ఉన్నట్లుగా కనిపిస్తున్నారు గాని నిజంగా మీరు లేరు, ఉన్నది పురుషోత్తముడు ఒక్కడే, మన కళ్ళకు కనిపించేది ఏదీ నిజంకాదు అని చెప్పాడు, అది ఫైనల్.

త్యాగి కాని వాడికి కోటి జన్మలు ఎత్తినా, వాడు ఎన్ని సాధనలు చేసినా వాడికి జ్ఞానం రాదు. భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు కాని మనకు స్వార్థం ఉండటం వలన ఆయన మనకు తెలియటం లేదు. అసలు మనకు స్వార్థం రాకుండా ఉండాలి కాని వస్తే వాడికి బంధువులు, స్నేహితులు, సమాజం ఇంక ఏమీ అక్కరలేదు. మొత్తం ప్రపంచం అంతా వాడి స్వార్థం ముందు బలి. స్వార్థం మనకు వికాసం రానివ్వదు. స్వార్థంలో నుండి విడుదల చెయ్యమని మనం భగవంతుడిని ప్రార్థించము, మన స్వార్థం కోసమే ఆయనను ఆరాధిస్తాము. ఒక లక్షమంది వెంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తారు అనుకోండి అందులో భక్తి జ్ఞాన వైరాగ్యములు ప్రసాదించమని కోరుకొనేవారు అయిదుగురు కూడా ఉండరు. మనకు ఆ యోగ్యత లేదు కాబట్టి కోరుకోము. భగవంతుడి దగ్గరకు వెళ్ళి ఏ చీపురుకట్టో కోరుకొంటాము. దేవుడి దగ్గరకు వెళ్ళి అటువంటివి కోరుకోవటం ఏమిటి? మనం ఏ గుడి చుట్టూ తిరిగినా మన స్వార్థం పెంచుకోవటం కోసం తిరుగుతున్నాము కాని జ్ఞానాన్ని, వైరాగ్యాన్ని ప్రసాదించమని అమ్మవారిని అడిగేవారు లేరు, అయ్యవారిని అడిగేవారు లేరు. ఆచార్యులవారికి కాశీ అంటే మహా ఇష్టం. కాశీ విశ్వేశ్వరుడు నా తండ్రి, అన్నపూర్ణ నా తల్లి, నాకు బంధువులంటూ ఎవరూ లేరు భక్తులందరూ నాకు బంధువులే అన్నారు ఆచార్యులవారు. ఆయన అమ్మవారి అనుగ్రహం పొందారు, భక్తులకోసం అనేక స్తోత్రాలు వ్రాసారు.

మీరు ఆ భిక్ష, ఈ భిక్ష కోరుకోవటం ఎందుకు, జ్ఞానభిక్ష కోరుకోండి అని అమ్మవారు

చెపుతున్నారు. ఎందుకు వచ్చిన భిక్షలు అవి, మీ నాన్నగారు ఒక ఎకరం పొలం ఇచ్చారు అనుకోండి, అమ్మేసుకొంటే అది పోతుంది. ఒక చీర కొని ఇచ్చారు అనుకోండి, సంవత్సరంలో అది చిరిగిపోతుంది. మీ తల్లితండ్రులు, బంధువులు ఏమి ఇచ్చినా అవి ఉండవు. ఒకవేళ ఆ సంపదలను మీరు జాగ్రత్త పెట్టినా కోడళ్ళో, కూతుళ్ళో లాగేస్తారు. సంపదలు అన్నీ అటువంటివే అవి ఏమీ నిలబడవు. అందుచేత అమ్మవారు ఏమంటున్నారు అంటే మీకు పది రూపాయలు ఉంటే పంచి పెట్టటం పొరపాటు అని అనటం లేదు, మీకు పంచిపెట్టే శక్తి ఉంటే జ్ఞానాన్ని పంచిపెట్టండి, అది పెర్మనెంట్‌గా ఉంటుంది అని చెపుతున్నారు. మీకు ఇంట్లో సంపద ఎంత ఉన్నా మీరు సుఖపడలేరు. జ్ఞానం లేకపోతే మనిషికి సుఖం లేదు, శాంతి లేదు, మోక్షం లేదు. అందుచేత మనం అమ్మవారి దగ్గరకు వెళ్ళినప్పుడు జ్ఞాన భిక్ష పెట్టమని అడగాలి కాని మోకాలు నొప్పి తగ్గించమని అడగటం ఎందుకు? పోనీ మోకాలు నొప్పి తగ్గితే మీరు వెయ్యి సంవత్సరాలు బతుకుతారా? ఇటువంటివి అడగటం పొరపాటు అని నేను అనటం లేదు కాని ఇవి అన్నీ తాత్కాలికాలు, ఇవిఅన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. జ్ఞానభిక్ష మటుకు కాలప్రవాహంలో కొట్టుకొనిపోదు, మీకు అమృతస్థితిని ప్రసాదిస్తుంది. జ్ఞానమే నిజమైన ఐశ్వర్యం అందుచేత మీరు భిక్ష అడిగితే జ్ఞానభిక్షను అడగండి అని అమ్మవారు చెపుతున్నారు.

మన బుద్ధి బాగుపడాలంటే అమ్మవారిని ఆశ్రయించాలి. మన బుద్ధి బాగుచేసుకోక పోతే మనకు ఎప్పుడు చూసినా దుఃఖమే. మన బుద్ధి బాగుపడటానికి మనకు దేవీ అనుగ్రహం లేదు, అనుగ్రహం సంపాదించటానికి మనం ఏమీ ప్రయత్నం చేయటంలేదు. అసూయ పడేవారికి ఎలా దుఃఖం వస్తుందో అలాగే పొట్టకోసం ఎవరిమీద ఆధారపడినా దుఃఖం వస్తుంది. అందుచేత చనిపోయేవరకూ ఎవరిది వారికి ఉండాలి. లేకపోతే ఏదోరకమైన దుఃఖం వస్తుంది. కొంతమంది అతి కోపిష్టులు ఉంటారు. వారికి కోపం వస్తే ఇంట్లోవారిని, బయటవారిని కలిపి తిట్టేస్తారు. తిట్టిన తరువాత అనవసరంగా తిట్టామని బాధపడతారు. మనం ఎప్పుడూ నోరు పాడుచేసుకోకూడదు. చెపితే మంచి మాటలు చెప్పాలి లేకపోతే నోరుమూసుకొని పడి ఉండాలి కాని చెడుమాటలు మాట్లాడకూడదు. మీ కుటుంబ సభ్యుల పట్ల, సమాజం పట్ల అతి జాలి, అతి ప్రేమ పనికిరాదు. ఇంట్లో వారిపట్ల అతి జాలిగా ఉంటే వారు పాడైపోతారు. అతిజాలిగా ఉంటే మీ మనస్సు లోపలకు వెళ్ళదు, దీనివలన మీకు దుఃఖం వచ్చేస్తుంది, అది ఆత్మజ్ఞానం పొందటానికి అడ్డు వస్తుంది. నీ దేహంతోటి, నీ మనస్సులో వచ్చే వికారములతోటి,

చావు పుట్టుకలతోటి సంబంధం లేకుండా నీ లోపల చైతన్యం ఉంది. అది నేను అయి ఉన్నాను, అది నేను అయి ఉండటం కాదు, అది మీరు అయి ఉన్నారు, అయితే నేను ఎవరిని మీరే అంటున్నాడు పరమాత్మ. నేను మీరే అయినప్పుడు ఇంక నన్ను మీరు ఎలా విడిచిపెట్టగలరు. మీ అత్తగారిని విడిచిపెట్టాలంటే విడిచిపెట్టగలరు, మీ ఆయనను విడిచిపెట్టాలంటే విడిచిపెట్టగలరు. మిమ్మల్ని మీరు ఎలా విడిచిపెట్టగలరు. నేను మీకు వేరుగా ఉంటే కోపం వస్తే విడిచిపెట్టేయవచ్చు, నేను మీలో ఆత్మగా ఉన్నప్పుడు, ఆత్మ మీరైనప్పుడు, నన్ను మీరు ఎలా విడిచిపెడతారు, విడిచిపెట్టటం సాధ్యం కాదు. నేను, మా ఆయన (భగవంతుడు) ఒక్కటే అని నోటితో అనటం కాదు అది అనుభవంలోనికి రావాలి, అది కడసారిజన్మ. అది అనుభవంలోనికి వచ్చేవరకు దుఃఖం వెంటాడుతుంది, భయం వెంటాడుతుంది, కోపం వెంటాడుతుంది, రాగ ద్వేషాలు వచ్చేస్తూ ఉంటాయి.

మీకు ఎవరికి జ్ఞానం వైపుకు మొఖం తిరగటం లేదు. వ్రతాలు చేసేవారు, జపాలు చేసేవారు, గుడులు కట్టించేవారు ఇవన్నీ పుణ్యంకోసం చేస్తున్నారు కాని జ్ఞానం ఎవరికి అక్కరలేదు. అంటే పుణ్యం చేస్తే మంచిజన్మలు వస్తాయి, అనుభవించవచ్చు అనుకొంటారు అంటే ఎంతసేపు మనకు ఇంద్రియాల గొడవే. పుణ్యం కూడా బంధిస్తుంది అని మనకు తెలియటం లేదు. పాపం ఇనుపసంకెళ్ళు అయితే పుణ్యం బంగారుసంకెళ్ళు. పుణ్యఫలితం ఉంటే రోజులు బాగా వెళ్ళిపోతాయి, ఇవన్నీ కాలప్రవాహంలో పోతాయి. ఆత్మజ్ఞానం మటుకు నీ ఇంద్రియాలకు, నీ మనస్సుకు, నీ బుద్ధికి అందనటువంటి శాంతిని నీకు ప్రసాదిస్తుంది. అది అలౌకికమైన శాంతి, అభౌతికమైన శాంతి. మీరు ఏదో కాలక్షేపం కోసం శ్రవణం చేయటం కాదు. ఇది చాలా ముఖ్యమైన సబ్జక్టు, మీరు శ్రద్ధగా శ్రవణం చేయండి. జ్ఞానానికి మించిన వస్తువు లేదు, జ్ఞానానికి మించిన సంపద లేదు. జ్ఞానం నీకు శాశ్వతమైన నిర్వాణస్థితిని కలుగ చేస్తుంది. మనకు జ్ఞానసముపార్జన అసలు లేదు. ఏదో పుణ్యం సంపాదించుకొంటే భోగాలు అనుభవించవచ్చు అనుకొంటున్నాము. కాలంతోటి, కర్మతోటి సంబంధం లేకుండా ఏదైతే స్వతంత్ర్యంగా ఉందో దాని వైపుకు మన మనస్సు మళ్ళటం లేదు. అసలు అది పొందుతామా లేదా అనే విషయం ప్రక్కన పెట్టండి, ఆత్మజ్ఞానం పట్ల మనకు కాంక్ష కలగటం లేదు. ఆ కాంక్ష కలగటానికే సజ్జనసాంగత్యం. సజ్జనుల సమక్షంలో జ్ఞానం యొక్క విలువ మనకు తెలుస్తుంది. అప్పడు జ్ఞానం సంపాదించాలనే బుద్ధి మనకు కలుగుతుంది. ఆ బుద్ధి కలగాలంటే అమ్మవారి దయ ఉండాలి. మనందరం పవిత్రులం అవ్వటానికి కృషి చేయాలి. అద్దం స్వచ్ఛంగా ఉంటే మన

మొఖం ఎంత బాగా కనిపిస్తుందో, మనం పవిత్రులం అయితే మన హృదయంలో ఉన్న వస్తువు అంత స్పష్టంగా మనకు గోచరిస్తుంది. మాటలోగాని, చేతలోగాని, ఆలోచనలోగాని అహంభావన రాకుండా చూసుకోవాలి. జీవితవిధానంలో, మన ప్రవర్తనలో బహుజాగ్రత్తగా ఉంటే మనం అమ్మవారి అనుగ్రహానికి పాత్రులవుతాము. తల్లితండ్రులు చెడ్డవారా, మంచివారా అనేది మీకు ఎందుకు, భగవంతుడు చెప్పినట్లుగా వారిని మీరు చూస్తే మీరు ఆయన దయకు పాత్రులవుతారు. మీరు సబ్జక్టు బాగా అర్థం చేసుకొంటే దానిమీద మీకు రుచి కలుగుతుంది. ఆ రుచి కలిగితే ఇంక మీరు దానిని విడిచిపెట్టలేరు. మీరు చాలా సుఖాలు అనుభవిస్తున్నారు కాని ఎప్పుడైనా ఆత్మసుఖం ఒక్కసారి రుచి చూసారు అనుకోండి. అది మధ్యలో పోవచ్చు అయినా ఇది వరకు ఆత్మసుఖం రుచి చూసాము, అది ఇలా ఉంది కదా, మరల దానిని పొందుదాము అని మీరు దానికోసం ప్రయత్నం చేస్తారు. అందుచేత ఒక్కసారి ఆ రుచి మీకు తెలియటం మంచిదే.

నేను 20 సం॥ల నుండి సాధన చేస్తున్నాను కాని ఏమీ అభివృద్ధి కనబడటం లేదు అని ఒక భక్తుడు భగవాన్‌ను అడుగుతున్నారు. సాధన చేసి ఏదో కొత్తగా సంపాదించటంకాదు, మనలో ఉన్న చెడ్డను కాల్చి బూడిద చెయ్యటమే సాధన. మీలో ఏమీ చెడ్డలేదు అనుకోండి మరి మీలో ఉన్నదేవుడు మీకు ఎందుకు కనిపించటంలేదు. అందరూ మేము మంచివారము, మేము మంచివారము అంటున్నారు మరి మీరు నిజంగా మంచివారు అయితే మీకు దేవుడి దర్శనం ఎందుకు అవ్వటంలేదు. మనం బుద్ధిమంతులం అయితే దేవుడు మనకు తెలియబడ టానికి ఒక్క క్షణం కూడా ఆగడు. మనలో ఉన్న పెంట, మనలో ఉన్న బలహీనతలు, ఎన్నో జన్మల నుండి మనలో పేరుకుపోయిన లోపాలు, పాపాలు అన్నింటిని బయటకు లాగి కాల్చి బూడిద చేయకపోతే ఎవరికీ ఆత్మజ్ఞానం కలుగదు. ఇది వదిలేసి మేము మంచివారము, మేము అది చేసాము ఇది చేసాము అంటారు, లోపల పెంటపెట్టుకొని మీరు ఏమి చేస్తారు. మనకు భయం పోలేదు, అసూయ పోలేదు, కోరికలు పోలేదు పైగా వీటితో పాటు మనకు దేవుడు కావాలి. దేవుడు ఈ కళ్ళతో చూడబడేవాడు కాదు. రాముడు మీకు దర్శనం ఇవ్వవచ్చు, ఆయన వరాలు ఇవ్వవచ్చు మీరు పుచ్చుకోవచ్చు. ఇవన్నీ ప్రకృతిగొడవలు. మీ మనస్సు ఎంత నిజమో ఈ గొడవలు కూడా అంతేనిజం. మనం వేలాది జన్మలు ఎత్తుతున్నాము. ఆ జన్మకు ఆ జన్మ కుళ్ళును పోగుచేసుకొంటున్నాము ఇంక మనకు జ్ఞానం ఏమిటి? మనలో ఉన్న చెడ్డను వేరుతో సహా బయటకు లాగి కాల్చి బూడిద చేయాలనే బుద్ధి ఇంతవరకు మనకు రాలేదు. రాగద్వేషాలు లోపల పెట్టుకొని 30 సం॥లు నుండి

సాధన చేస్తున్నాను నాకు జ్ఞానం రావటం లేదు అంటే సాధన ఏమి చేస్తున్నాడు, రోడ్డు మీద ఉన్న దుమ్ము అంతా పోగుచేసుకోవటం సాధనా? మీకు లోపలకు వెళ్ళటం చేతకాక పూజ చేస్తున్నాము, జపం చేస్తున్నాము అంటూ బయటగోడవలు పెంచేసుకొంటున్నారు.

ఆత్మఅయి, ఆత్మవిద్య చెప్పాలి. ఆత్మానుభవం లేనివాడు ఆత్మవిద్య చెపితే అందులో రుచి ఏమి ఉంటుంది. సాధన అంటే లోపల ఉన్న చెడ్డనంతా శుభ్రంగా కడిగేసి మనస్సును ఎండబెట్టాలి. ఏది పోగొట్టుకొంటే జ్ఞానం వస్తుందో మనకు తెలియటం లేదు, బయట నుండి ఏదో సంపాదించాలి అనుకొంటున్నారు. ఇది బయటనుండి వచ్చేది కాదు, లోపల నుండి ఊరాలి. సాధన చేస్తున్నాను నా మనస్సు లోపల ఉండమంటే ఉండటం లేదు, ఎక్కడో ఒకచోట తిరిగి వస్తోంది అని భగవాన్‌తో అంటున్నారు. నీ మనస్సు బయటకు వెళుతోంది అని నీకు తెలుస్తోంది కదా, ఆ బయటకు వెళ్ళే మనస్సును పట్టుకొని, వెనుకకు లాక్కొచ్చి నీ హృదయంలో ఉన్న సత్యం మీద నిలబెట్టు, అక్కడ నిలబెట్టలేకపోతే నీ ఇష్టదైవం మీద నిలబెట్టు అంటున్నారు భగవాన్. మీరు లోకంలో ఉన్నదంతా సంపాదించి, లోపల ఉన్న సత్యపదార్థాన్ని మీరు ఎరుకలోనికి తెచ్చుకోకపోతే మీరు అనుభవించే నష్టం ఎంతో మీ శరీరం చనిపోయాక మీకు తెలుస్తుంది, జీవితం అంతా వృధా చేసుకొన్నాము, ఒకటి లేని సున్నలు సంపాదించుకొన్నాము అని అప్పుడు మీకు తెలుస్తుంది. భగవంతుడి యొక్క ఏ రూపాన్ని మీరు ఆరాధించినా, ఏ నామాన్ని స్మరించినా మీరు బ్రహ్మంలోనే ఐక్యమవుతారు అని పరమాత్మ చెప్పాడు. అయితే మీరు చేసే సాధనలో శుద్ధి ఉండాలి, సిన్సియారిటీ ఉండాలి. శుద్ధి లేకుండా సిద్ధి కలుగదు. దుర్గమ్మ మహాశక్తి వంతమైనది. అనేకమంది రాక్షసులను సంహరించింది. దుర్గమ్మా నువ్వు బయట అనేకమంది రాక్షసులను సంహరించావు, మా లోపల ఉన్న రాక్షసులను కూడా సంహారం చేసిపెట్టు, నీ సహాయం లేకుండా నేను ఒడ్డుకు రాలేను అని దుర్గమ్మను మనం ప్రార్థించాలి. తల్లితండ్రులు కూడా మా అబ్బాయి బాగా చదువుకోవాలి, బాగా డబ్బు సంపాదించుకోవాలి, సంఘంలో గౌరవం సంపాదించుకోవాలి ఇలా కోరుకొంటున్నారు కాని మా అబ్బాయికి జ్ఞానం ప్రసాదించు అని కోరుకొనే తల్లితండ్రులు ఎవరైనా ఉన్నారా? ఆత్మజ్ఞానం వరకు వెళ్ళవద్దు మా అబ్బాయి బుద్ధి బాగుపడాలి, బుద్ధి స్వచ్ఛంగా ఉండాలి అని కూడా ఎవరూ కోరుకోవటంలేదు. మట్టి, రాయి, బంగారం ఈ మూడింటిని సమానంగా చూసేవాడికే మనస్సు లోపలకు వెళుతుంది. మట్టిని చూసినప్పుడు ఎలా ఉన్నాడో రాయిని చూసినా, బంగారాన్ని చూసినా వాడి బుద్ధి అలాగే ఉంటే వాడికి అంతర్‌దృష్టి కలుగుతుంది. మనస్సు బయటకుపోతూ ఉంటే ఏ కారణం

వలన మనస్సు బయటకు పోతోంది, ఏ అలవాటు మనలను బాధ పెడుతోంది అని జాగ్రత్తగా చూసుకొని ఆ కారణంలోనుండి మనస్సును తప్పించటానికి ప్రయత్నం చేయాలి. మనం సిన్సియర్‌గా ప్రయత్నం చేస్తూ ఉంటే కాలం కలిసివస్తుంది, దేవుని అనుగ్రహం వస్తుంది, ఆ అలవాటు పత్తా లేకుండా పోతుంది. మీరు బుద్ధిమంతులు అవ్వాలంటే, మీ సాధన బాగా సాగాలంటే జరిగిపోయిన గొడవలు అన్నీ కంప్లీట్‌గా మర్చిపోయి సాధన మొదలుపెడితే వాలుగాలిలో సైకిలు త్రొక్కినట్లుగా మీ సాధన బాగాసాగుతుంది. జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవటం వలన ఆధ్యాత్మికంగా, భౌతికంగా కూడా ఏమీ కలిసిరాదు, మీ కాలం వృధా అవుతుంది.

మీరు ఎవరికోసం అయితే కష్టపడి, కష్టపడి దెబ్బలుతిని, నిష్టూరాలు పడి సంపాదిస్తున్నారో వారు వల్లకాటి దాకా వచ్చి మిమ్మల్ని పడేసిపోతారు అని తెలిసినా కష్టపడుతున్నారు, అదే మమకారం అన్నాడు కృష్ణుడు. ఆ మమకారం అంతతేలిగ్గా మిమ్మల్ని విడిచిపెట్టదు. మమకారం పోకపోతే నీకు జ్ఞానంరాదు. మీ ఇంట్లో వారిపట్ల మీరు డ్యూటీ చేయండి. అంతేగాని అతిజాలి, అతిదయ పనికిరాదు, దానివలన మీ మనస్సు కుళ్ళిపోతుంది, మీరు పాడైపోతారు. నువ్వు ఏదైతే కాదో దానిగురించి ఆలోచన తగ్గించుకో, నువ్వు ఏదైతే అవునో దానిని పట్టుకొని వ్రేళ్ళాడు. అలవాట్లు పోవటం లేదు అని మీరు కంగారు పడకండి. ఈశ్వరుడిని ప్రార్థించగా ప్రార్థించగా, ఆయనను స్మరించగా స్మరించగా ఆయన దయవలన అవే మిమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళిపోతాయి గాని అలవాట్లను నువ్వు విడిచిపెట్టలేవు. మీరు ఏదైనా పని మొదలుపెట్టేటప్పుడు లోపల సంకల్పం బాగుండాలి. మీ సంకల్పం బాగుంటే మీకు అన్నీ వచ్చేస్తాయి, మోక్షం కూడా వచ్చేస్తుంది. అసలు మనం సంకల్పంలోనే ఫెయిల్ అయిపోతున్నాము. మన సంకల్పం నిర్మలంగా, నిశ్చలంగా ఉండాలి కాని గందరగోళంగా ఉండకూడదు. శరీరం, ఇంద్రియాలు, మనస్సు ఈ మూడు ఒక అడవి, ఈ మూడింటి చుట్టూ తిరుగుచున్నాము. గురువు అనుగ్రహం లేకపోతే ఈ అడవిలో నుండి కోటిజన్మలు ఎత్తినా మనం బయటకు రాలేము. మీరు డబ్బు సంపాదించుకొంటున్నారు, గౌరవం సంపాదించుకొంటున్నారు అలాగే ఈశ్వరుని దయను కూడా సంపాదించుకోండి. ఈశ్వరుని దయ ఉంటే మీకు అన్నీ ఉన్నట్లే, మనం డబ్బు సంపాదిస్తే భోగాలు కొనుక్కోవచ్చు, ఈ భోగాలు అన్నీ రాబోయే జన్మలలో రోగాల కింద మారిపోతాయి. ఈశ్వరుని దయను సంపాదిస్తే ఆయన మోక్షాన్ని ఇస్తాడు. మనం ఏదైతే కాదో ఆ గొడవలలోనికి వెళ్ళటం మానివేసి, ఏది అవునో దానిని దృష్టిలో పెట్టుకొని

సాధన చేస్తే కానివి అన్నీ బయటకు పోతాయి, అది రహస్యం. మీకు అనారోగ్యం వస్తే పత్యము చేస్తున్నారు కదా, తినకూడనివి తినటంలేదుకదా, మామూలుగా ఆరోగ్యం కాపాడుకోవటానికి కూడా పత్యం చేస్తున్నారు కదా, మరి మోక్షం సంపాదించుకోవటానికి పత్యం చేయనక్కరలేదా అని అడుగుతున్నారు.

మనకు అహంకారం, మమకారం లేకపోతే చాలా జబ్బులు తగ్గిపోతాయి. మీ అబ్బాయి అంటే మీకు బాగా ఇష్టం అనుకోండి, వాడు మీతో సరిగా మాట్లాడకపోతే మీ మనస్సుకు కంగారు వస్తుంది, అశాంతి వస్తుంది, దానివలన ఆకలి తగ్గిపోతుంది, అక్కడ నుండి రోగాలు ప్రారంభం. మమకారం వలన రోగం వస్తోందని మీకు తెలియటం లేదు. మీ దేహాన్ని, మనస్సును చాలా ఆరోగ్యంగా ఉంచుకోవాలి. ఆత్మజ్ఞానసముపార్జనకు ఇవి రెండూ పనిముట్లు. మీ భక్తి నిజమైతే మీ అవసరాలను భగవంతుడు తీరుస్తాడు. మీ అవసరాలు ఏమిటో మీకంటే ఎక్కువ భగవంతుడికి తెలుసు. ఆయన దయాస్వరూపుడు. ఎవడైతే సన్యాసో వాడు యోగి అని పరమాత్మ చెప్పాడు. సన్యాసి అంటె ఎర్రబట్టలు కట్టుకొన్నవాడు కాదు, కర్మఫల కాంక్షలేనివాడు సన్యాసి. దైనందిన జీవితంలో తను చేసే కర్మ. భగవదనుభవం పొందటానికి సహాయ పడేలా పని చేసుకొనేవాడు యోగి. మన మనస్సు ఒకోసారి శాంతిగా ఉంటుంది, ఒకోసారి శాంతిగా ఉండదు, దానికి మనలో ఉన్న గుణాలు కారణం. మనిషి తమోగుణంలో ఉన్నప్పుడు ఒకరకంగా ఉంటాడు, రజోగుణంలో ఉన్నప్పుడు ఒకరకంగా ఉంటాడు, సత్వగుణంలో ఉన్నప్పుడు ఒక రకంగా ఉంటాడు. ఈ శరీరం గుణాలచేతిలో పనిముట్టు. మనం భౌతికంగా బాగుపడాలన్నా, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలన్నా సత్వగుణం పోషించుకోవాలి. సత్వగుణం కూడా గుణమే కాని భగవంతుడిని చేరుకోవటానికి అది దారి చూపిస్తుంది. మనం సాధన చేస్తూ ఉంటాము, పడిపోతూ ఉంటాము అయినా కాని ప్రయత్నం మానకండి, గమ్యాన్ని దృష్టిలో పెట్టుకోండి. ఇంద్రియాలు నెంబర్‌వన్ దొంగలు. మనం కష్టపడి సాధన చేసి ఏదైనా సంపాదించుకొంటే అవి పట్టుకొనిపోతాయి. మనస్సు ఆత్మను ధ్యానం చేయగా చేయగా మనస్సు ఆత్మాకారం చెందుతుంది. కాని మనం ఆత్మ దగ్గరకు వెళ్ళకుండా ఇంద్రియాలు దొంగతనం చేసి పట్టుకొనిపోతాయి, ఆ దొంగలను మనం అదుపులో పెట్టుకోవాలి. నువ్వు దేనినైతే తెలుసుకోవాలనుకొంటున్నావో, దేనికోసం జపాలు ధ్యానాలు చేస్తున్నావో, దేనిని తెలుసుకోవటానికి యజ్ఞాలు యాగాలు చేస్తున్నావో అది నీవై ఉన్నావు. అది నీకు తెలియకపోవటం వలన లేదు లేదు అనుకొంటున్నావు. నీ శరీరం ఈ భూమి మీద

తిరుగాడుతున్నప్పడే, నీ శరీరం ఆరోగ్యంగా ఉన్నప్పడే సత్సంగాలు చేసి, సత్పురుషులతో సహవాసం చేసి, గురువును ఆశ్రయించి, మీరు చేయగలిగినంత మంచి చేస్తూ, మంచిమాటలు శ్రవణం చేస్తూ మీ హృదయంలో ఉన్న సద్వస్తువును పట్టుకోవటానికి ప్రయత్నం చేయండి.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 09-10-08, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

హిందూమతంలో భగవంతుడిని పురుషుడిగాను, స్త్రీగాను కూడా ఆరాధిస్తారు. ఎలా ఆరాధించినా భగవంతుడు ఒక్కడే, సత్యం ఒక్కటే, ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే, అదే బ్రహ్మం. బ్రహ్మం యొక్క స్వరూపం ఆనందం, శాంతి, అది అందరి హృదయాలలో ఉంది, అంతటా వ్యాపించి ఉంది. అది మీ మనస్సుకు, ఇంద్రియాలకు, బుద్ధికి అందదు. దాని శక్తి వలన ఈ సృష్టి అంతా నడుస్తోంది, దాని శక్తి వలన మనం పని చేస్తున్నాము. ఈ రోజు విజయదశమి. దుర్గ అంటే దురాలోచనలు, దురలవాట్లు పోగొట్టేది. దుర్గమ్మను ఆరాధిస్తే విజయం కలుగుతుంది. మన ఆలోచనలతోటి సంబంధం లేకుండా, మన తలంపులతోటి సంబంధం లేకుండా జరిగే సంఘటనలు చాలా స్వీటుగా ఉంటాయి. తులసీదాసు మహాభక్తుడు. తులసీదాసు చిన్నతనంలో ఆయన తల్లి తండ్రులు చనిపోయారు, ఆయనను పెంచిన దాసి కూడా తరువాత చనిపోయింది. ఎవరూ చూసేవారు లేక కొంతకాలం బిక్ష చేసుకొన్నారు. వాడికి చిన్నప్పడు తల్లితండ్రులు పోయారు, పెంచిన దాసి కూడా చనిపోయింది, వీడు మన ఇంటికి వస్తే మనం చనిపోతాము అని ఆయన బిక్షకు వచ్చినప్పడు తలుపులు వేసేసుకొనేవారు. తరువాత తులసీదాసుకు పెళ్లి అయ్యింది. ఒకసారి భార్య పుట్టింటికి వెళ్లి పదిరోజులు వరకు రాలేదు. అప్పడు తులసీదాసు భార్యకోసం వెళ్లిపోయాడు. నేను వచ్చేస్తాను అని చెప్పాను కదా మీరు అలా రాకూడదు. నా దేహం మీద మీకు మమకారం ఎక్కువ కనిపిస్తోంది. ఈ దేహంలో ఏముంది? వైభవం అంతా రాముడిలో ఉంది. నామీద ఉన్న ప్రేమ, నా మీద ఉన్న ఇష్టం రాముడి మీద ఉంటే ఈపాటికి మోక్షం వచ్చేది. నామీద ఉన్న మోహాన్ని అంతా రాముడిమీద పెట్టావు అనుకో నీకు మోక్షం వచ్చేస్తుంది అని భార్య చెప్పింది. పూర్వజన్మలలో తులసీదాసు రామభక్తుడు. భార్య అన్న మాటలకు పూర్వజన్మలో ఉన్న రామభక్తి స్మృతిలోనికి వచ్చింది. భార్యకు ఏమీ చెప్పలేదు, అక్కడ నుండి వెళ్లిపోయాడు, తరువాత చాలా పెద్దవాడు అయిపోయాడు. తులసీదాసు హనుమాన్ చాలీసా వ్రాసారు. తులసీదాసుగారు రామాయణం చెపితే కాశీలో హనుమంతుడు మారువేషంలో వచ్చి వినేవాడట.

మనకు ఎంతో కొంత వైరాగ్యం ఉండాలి, వైరాగ్యం లేనప్పుడు మనం ఎంత సాధన చేసినా చిల్లుకుండలో నీరు పోసినట్లుగా ఉంటుంది. అంటే వైరాగ్యం లేకుండా సాధన చేస్తే సాధన అంతా వెళ్ళిపోతుంది. మనం యాత్రలకు వెళ్ళటం, పారాయణం చేయటం వీటి అన్నింటికంటే మనోనిగ్రహం ముఖ్యం, వైరాగ్యం ముఖ్యం. ఇక్కడ ఉన్న సంపదలు మరణానంతరం మన కూడా రావు కాని వైరాగ్యం, మనోనిగ్రహం రాబోయే జన్మకు మన కూడా వస్తాయి. నీ దేహాన్ని, ఇంద్రియాలను, మనస్సును, నీకు ఉన్న డబ్బును, తెలివితేటలను వీటినన్నింటిని ఉపయోగించుకొని భగవదనుభవం పొందాలి, అదే మనలక్ష్యం. మనం ఏదైనా పనిచేసేటప్పుడు తొందరపడి చేయకూడదు, నిదానంగా ఆలోచించాలి. నువ్వు పదిసార్లు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాక అప్పుడు వెనక్కి వెళ్ళకూడదు, ఆ నిర్ణయానికి కట్టుబడి ఉండాలి. సజ్జనసాంగత్యం ఎంత మంచిదో, సజ్జనులు కానివారితో సహవాసం చేస్తే అంత ప్రమాదం. అందుచేత చదివే పుస్తకాల విషయంలో, చేసే స్నేహాల విషయంలో, చూసే విషయాల విషయంలో మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. మనం ఎటుచూసినా మంచిని వింటూ ఉండాలి, మంచిని ఆలోచిస్తూ ఉండాలి, మంచి మాట్లాడాలి. మంచితనం వలన బ్రాహ్మీస్థితిని పొందటానికి దారి కనబడుతుంది.

మనకు భగవంతుడు ఏ అవకాశములు ఇచ్చాడో అవన్నీ బ్రహ్మానుభవం పొందటానికి జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. మనకు విషయానందం తెలుసుకాని ఆత్మానందం తెలియటం లేదు. విషయానందం కంటే ఆత్మానందం కోటిరెట్లు గొప్పది, పుస్తకాలు చదవటం వలన అది తెలియదు, అది అనుభవైకవేద్యం. సోమరితనంగా ఉంటే దురాలోచనలు వస్తాయి. మనం ఎంతకాలం జీవిస్తే అంతకాలం మన మనస్సు దైవమయం అయిపోవాలి, అప్పుడు దురాలోచనలు రావు. మన మనస్సు చెప్పినట్లుగా కాకుండా భగవంతుడు చెప్పినట్లుగా పనిచేయాలి, అప్పుడు మనస్సు నెమ్మదిగా సన్నగిల్లి రాలిపోతుంది. మీరు ఎన్ని వందల కోట్లు సంపాదించినా అలవాట్ల విషయంలో జాగ్రత్తగా ఉండకపోతే, మనోనిగ్రహం లేకపోతే ఏమీ ప్రయోజనం లేదు. చిన్న విత్తనంలో పెద్ద చెట్టు ఉంటుందని మనం ఊహించలేము కాని విత్తనం పాతిపెడితే పెద్ద చెట్టుకింద అయిపోతుంది. అలాగే మీలో కర్తృత్వం అనే బీజం ఉన్నప్పుడు సంతోషాలు, దుఃఖాలు, లాభాలు, నష్టాలు ఇలా అనేకమైన గొడవలు వస్తూ ఉంటాయి. కర్తృత్వం అనే బీజం నశించే వరకు మీరు ఎన్ని పుణ్యాలు చేసినా, యజ్ఞాలు చేసినా, ఎంత సాధన చేసినా మీకు జ్ఞానం రాదు. సమస్త దుఃఖాలకు కారణం కర్తృత్వం

అనే బీజంలోనే ఉంది అని పరమాత్మ చెప్పాడు. కర్తృత్వం అనే బీజాన్ని కాల్చి బూడిద చేయగలిగితే ఒడ్డుకు వచ్చేసినట్లే.

మనం కాలాన్ని పాడుచేసుకోకూడదు. ఈ దేహం ఏ క్షణంలో చనిపోతుందో చెప్పలేము. ఈ దేహానికి మరణం రాకముందే నీలో ఉన్న పునర్జన్మ హేతువులను బయటకు లాగి కాల్చి బూడిద చేయాలి లేకపోతే మరల ఈ భూమి మీదకు రావలసిందే, ఇంకో శరీరంలో కష్టపడి సాధన చేసి నీ అలవాట్లను, బలహీనతలను తొలగించుకోవలసిందే. అందుచేత అలవాట్ల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మీలో కొంతమందికి ధనం ఉంది, కొంతమందికి తెలివి ఉంది, కొంతమందికి ఆరోగ్యం ఉంది, కొంతమందికి కష్టపడి పనిచేసే స్వభావం ఉంది. ఇవి అన్నీ ఉండటం మంచిదే. కాని వీటన్నింటిని భగవదనుభవం పొందటానికి ఉపయోగించుకోవాలి. మీకు ఏదైనా మంచి జరిగితే సంతోషం వస్తుంది, చెడ్డ జరిగితే దుఃఖం వస్తుంది. ఈ మంచికి, చెడ్డకు మీరు కారణం కాదు, మీ పూర్వజన్మలో చేసిన కర్మను బట్టి ఎప్పుడు ఏ అనుభవాన్ని కలుగచేయాలో భగవంతుడు కలుగజేస్తాడు. ప్రతీ చిన్నవిషయం కూడా దేహప్రారబ్ధాన్ని బట్టి జరుగుతుంది. అది తెలియకపోవటం వలన ఆందోళన వస్తోంది, అశాంతి వస్తోంది. భగవంతుడు వేరు, మనం వేరు అనుకొంటున్నాము, అది ద్వైతం. కాని మనందరం భగవంతుడిలోనే ఉన్నాము. ఆయనను కాదని ఏదీ స్వతంత్రంగా చేయలేము. భగవంతుడికంటే వేరుగా నేను ఉన్నాను అనుకొనే ఆ నేను నశించేవరకూ నీకు ఆత్మజ్ఞానం కలుగదు. భగవంతుడి సంకల్పాన్ని మీరు అంగీకరించలేరు అందుచేత ప్రతీ మనిషికి దుఃఖం వస్తోంది. మనం చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చేయాలి. మన ఇంట్లో ఉన్న వస్తువులను కూడా జాగ్రత్తగా చూడాలి, వంట కూడా శ్రద్ధగా చేయాలి. అవినయం పనికిరాదు, అశ్రద్ధ పనికిరాదు. ప్రపంచంలో అనేక దేహాలు ఉన్నాయి, అందరూ ఒకేరకమైన పనులు చేయరు, ఆ దేహం ద్వారా ఏపని జరగాలో అదే జరుగుతుంది. పని నీవు శ్రద్ధగా చేసినా ఫలితం అనుకూలంగా ఉంటుంది అని చెప్పలేము. అలాగని అశ్రద్ధగా చేయకూడదు. ఒకోసారి సామాన్యంగా కష్టపడినా పలితం అనుకూలంగా ఉండవచ్చు. ఎందుకు అలా జరుగుతుంది అంటే దానికి పూర్వజన్మలకు అనుబంధం ఉంటుంది. నువ్వు శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని పనిచెయ్యి, భగవంతుడు చెప్పినట్లుగా పని చెయ్యి. అప్పుడు నీకు మనోనిగ్రహం వస్తుంది. ఎలా పనిచేస్తే జీవుడు బ్రహ్మంలో ఐక్యం అవుతాడో అలా పనిచేస్తే అది కర్మ, వాడు యోగి అవుతాడు.

మీరు జరిగిపోయిన గొడవలు అన్నీ మర్చిపోవాలి. వాటిని ఎందుకు జ్ఞాపకం పెట్టుకొంటున్నారు అంటే జాగ్రదవస్థ నిజం అనుకొంటున్నారు. జాగ్రదవస్థ నూటికి నూరు పాళ్ళు అబద్ధం. నిజంకానిదానిని నువ్వు జ్ఞాపకం పెట్టుకోవటం వలన నువ్వు పాడైపోవటానికి బీజం పడుతుంది. మిమ్మల్ని ఎవరైనా పొగడవచ్చు, ఎవరైనా విమర్శించవచ్చు, అదీ అబద్ధమే, ఇదీ అబద్ధమే, వాటని మర్చిపోండి. నీకు ఎవరైనా అపకారం చేసారు అనుకో, తిరిగి అపకారం చేసే శక్తి నీకు ఉన్నా అపకారం చేయకుండా ఉండటం కంటే, దానిని మర్చిపోవటం చాలా కష్టం. అలా మర్చిపోగలిగితే మీ మనస్సు చల్లబడుతుంది, మనస్సు తొందరగా భగవదభిముఖంగా ప్రయాణం చేస్తుంది. భగవంతుడు అనేక రూపాలు ధరించాడు. ఎవరు ఏ రూపాన్ని ఆరాధించినా నాలోనే చేరుకొంటారు అని పరమాత్మ చెప్పాడు. ఎదుటివారు ఆరాధించే రూపం తక్కువ, మనం ఆరాధించే రూపం ఎక్కువ అని బేధబుద్ధి పెట్టుకోనక్కరలేదు, మీకు ఇష్టమైన రూపాన్ని ఆరాధించుకోండి. మీరు ఏ మందు వాడినా రోగం తగ్గాలి అలాగే మీరు ఏ దేవతామూర్తిని ఆరాధించినా అజ్ఞానం పోవాలి. భగవంతుడి యొక్క రూపాన్ని ధ్యానిస్తూ ఉంటే, ఆయన నామాన్ని స్మరిస్తూ ఉంటే మనస్సుకు ఏకాగ్రత వస్తుంది, మనో చాపల్యం తగ్గుతుంది, మనస్సు చల్లబడుతుంది, బ్రాహ్మీస్థితి పొందటానికి మనస్సు ప్రిపేర్ అవుతుంది. భగవంతుడి సంకల్పాన్ని కాదని నీవు ఏమీ చేయలేవు. భగవంతుడు మీకు ఒకోసారి గౌరవాలు ఇస్తాడు, ఒకోసారి అవమానాలు ఇస్తాడు. గాంధీగారిని ఒకసారి జైలులో పెట్టారు. జైలులో నుండి బయటకు వచ్చాక ఒక ఉత్తరం వ్రాసాడు. మీరు జైలులో పెట్టటం మంచిది అయ్యింది, భగవద్గీత బాగా నేర్చుకొని బయటకు వచ్చాను అన్నారు. అంటే జీవితాన్ని పాజిటివ్‌గా తీసుకోవాలి, ఎప్పుడూ కూడా నెగిటివ్‌గా తీసుకోకూడదు.

మనం నేను, నేను అంటున్నాము, అది కల్పితం, అది నకిలీ నేను. గాఢనిద్రలో ఈ నేను లేనప్పుడు నీకు ఏ గొడవ లేదు. జాగ్రదవస్థలో ఈ నేను వచ్చాక దేహం గొడవ, లోకం గొడవ మొత్తం పెంట అంతా వచ్చేస్తుంది. ఈ నేను ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీ లేదు. నేను ఉన్నాను అని బైబిలులో ఉంది, అది మనం అనుకొనే నేను కాదు. నువ్వు ఉన్నమాట నిజమే, అబద్ధమైన నేనుగా లేవు, నిజమైన నేనుగా ఉన్నావు గాని అది నీకు తెలియటం లేదు, అది అనుభవంలోనికి తెచ్చుకోవటమే మోక్షం. నేను అనుకొన్నదే జరుగుతోంది అనుకోవటం మాయ. అలా ఏదైనా జరిగినా అది కూడా దేవుడు అనుకోవటం వలన జరిగింది కాని మీరు అనుకోవటం వలన జరగలేదు. సబ్జక్టు మీకు బాగా అర్థమవ్వాలి. మీకు ఇష్టం ఉన్నా లేకపోయినా

భగవంతుడి సంకల్పమే జరుగుతుంది. ఒకోసారి ఆయన సంకల్పం, మన సంకల్పం కలుస్తుంది అలా కలిసినప్పడు మనం సాధించాము అనుకొంటాము కాని అప్పడు కూడా ఆయన సంకల్పమే నెరవేరుతుంది. నేను సాధించాను, ఇదంతా నా వలననే అవుతోంది అనుకొనేవాడు చావాలి అప్పటివరకు నీకు జ్ఞానం రాదు అంటున్నారు. మీరు ఏదైనా పని చేసినా అంతర్యామిని చూసి చెయ్యండి. దేవుడు ఏ పని అయితే వద్దు అన్నాడో ఆ పని నువ్వు చేసావు అనుకో వెంటనే భయం వచ్చేస్తుంది, ఆ భయం నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. మీకు డబ్బు ఉంటే ఆనందం వస్తుంది. ఇతర వ్యక్తుల నుండిగాని, ఇతర వస్తుజాలంనుండిగాని వచ్చే ఆనందాన్ని భేదానందం అంటారు. ఆ ఆనందం ఎటువంటిది అంటే లోపల దుఃఖం ఉంటుంది పైన సుఖ కిరీటం పెట్టుకొని వస్తుంది, ఆ ఆనందం అంతా ఈ జన్మలోగాని రాబోయే జన్మలోగాని దుఃఖంగా మారిపోవును. సమాజంతో సంబంధం లేకుండా, కుటుంబ సభ్యులతో సంబంధం లేకుండా, ఇతర వస్తుజాలంతో సంబంధం లేకుండా లోపలనుండి ఉబికి ఉబికి వచ్చే ఆనందం స్వతంత్రమైన ఆనందం, అది అభేదానందం. వర్షపు నీటిని భూమి మీద పడకుండా గ్లాసులో పట్టుకొంటే ఎంత స్వచ్ఛంగా ఉంటుందో అభేదానందం అంత స్వచ్ఛంగా ఉంటుంది. ఒకో మనిషికి ఒకో వాసన అంటే ఇష్టం, ఆ వాసన నిజం అనుకొంటాడు. వాసనా క్షయం అవ్వకుండా మనకు కోటిజన్మలు ఎత్తినా ఆత్మజ్ఞానం రాదు. అలవాట్లలో నుండి బయటపడాలి అంటే దానికి మన తెలివితేటలు సరిపోవు, మన ప్రయత్నం సరిపోదు, కాలం కలిసి రావాలి, ఈశ్వరానుగ్రహం ఉండాలి. అంతేగాని ఏవో మహిమల వలన అలవాట్లు పోవు.

దేవుడు ఉన్నాడు, మనమూ ఉన్నాము అని అనుకొంటున్నాము, దేవుడు ఉన్నాడు, మనం లేనేలేము అని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి మనం సాధన చేయాలి. కోరిక యొక్క వేగం, కోపం యొక్క వేగం తగ్గించుకొంటూ రావాలి. వైరాగ్యాన్ని ప్రాక్టీసు చేయాలి. మనం ఎవరిపట్ల అయినా ద్వేషం పెట్టుకొంటే మోక్షం మాట అటు ఉంచండి, ముందు ఆరోగ్యం చెడిపోతుంది అందుచేత మనం ఎవరిమీద ద్వేషం పెట్టుకోకూడదు. తత్వమసి అది నీవై ఉన్నావు. నువ్వు అది దేహం అనుకొంటున్నావు, మనస్సు అనుకొంటున్నావు, నువ్వు పుడుతున్నాను, చనిపోతున్నాను అనుకొంటున్నావు, ఇవన్నీ అబద్దాలు. దేనికైతే పుట్టుకలేదో, చావులేదో, దేని స్వరూపమైతే ఆనందమో, ఏదైతే అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో ఉందో అది నీవై ఉన్నావు. నువ్వు ఏదైతే అవునో అది నీకు అనుభవంలో లేదు, అందుచేత కానిదానిని నిజం అనుకోవటం నువ్వు మానవు. అందుకే నువ్వు ఇది కాదు, నువ్వు అది కాదు అని చెప్పవలసి వస్తోంది.

కృష్ణుడు ఇది మానెయ్యండి, అది మానెయ్యండి అని ఎప్పడూ చెప్పడు, ఇది చెయ్యండి, అది చెయ్యండి అని చెపుతాడు. సజ్జనసాంగత్యం చెయ్యండి, నన్ను స్మరించుకోండి అని చెపుతాడు. ఎందుకంటే చేయవలసిన పనులు మనం చేస్తూ ఉంటే అక్కరలేని పనులు అవే పోతాయి. ఇలా చేస్తూ ఉంటే మీకు ఆత్మబలం పెరుగుతుంది, మనోనిగ్రహం వస్తుంది, అప్పడు మీరు కానివి దానంతట అదే మానేస్తారు. మనకు వైరాగ్యం లేకుండా ప్రపంచం మీద ఉన్న మోహం పోదు, వైరాగ్యం మీకు మోక్షాన్ని ప్రసాదిస్తుంది. నీకు అభేదానందం వచ్చినప్పడు మీ దుఃఖం అంతా సుఖంగా మారిపోవును, మీ దేహప్రారబ్దంలో అశాంతి అనుభవించవలసి ఉంటే మీ అశాంతి అంతా శాంతిగా మారిపోవును. నీ శరీరం స్మశానానికి వెళ్ళకముందే అభేదానందం అనుభవంలోనికి వస్తే అది కడసారిజన్మ. బాహ్యపరిస్థితుల వలన మీకు ఆనందం వస్తూ ఉంటే అది భేదానందం, అది పునర్జన్మలను తీసుకొని వస్తుంది. మీరు ఇంటికి వెళ్ళిన తరువాత ఈ మాటలు మననం చేసుకొంటూ ఉంటే అభేదానందం కొంచెం తెలుస్తూ ఉంటుంది. కాని పూర్వజన్మల నుండి వచ్చిన వాసనలు, మీ కోరికలు అభేదానందాన్ని నిలబడనివ్వవు. అభేదానందం నిలబడాలంటే వాసనాక్షయం అవ్వాలి. ఇప్పడు మనం భేదానందంలో నుండి అభేదానందంలోనికి మేల్కోవాలి, అదే మన జీవిత గమ్యం.

మీరు సమాజం పట్ల తగుమాత్రంగా ఉండాలి. అతిగా ఉంటే మోహం పెరిగిపోతుంది, కాలం వృధా అవుతుంది, రెండు నష్టాలు. మీకు సమాజంతో ఎక్కువ అనుబంధం ఉంటే తగ్గించుకోండి, తగ్గించుకోకపోతే సాధనకు టైము ఉండదు. సద్వస్తువు తాలుక ఎరుకే జ్ఞానం. జ్ఞానంతో సమానమైనది ఏదీ ఈ లోకంలో లేదు. జ్ఞానప్రాప్తి నీ జీవితగమ్యం, అది పొందాలంటే కాలాన్ని వృధా చేసుకోకూడదు. హృదయంలో ఒక నిజం ఉంది, అదే సత్యం, అదే ఆనందం, అదే శాంతి. యుగాలు మారినా, కాలప్రవాహంలో కోట్లాది సంవత్సరాలు కొట్టుకొని పోయినా మారనిది, చెదరనిది, నిజమైనది హృదయంలో ఉన్న సత్యం. అక్కడకు మేల్కోవటమే నీ జీవిత గమ్యం. నిద్రావస్థలో నుండి జాగ్రదవస్థలోనికి ఎలా మేల్కొంటున్నావో అలాగ నీ హృదయంలో ఉన్న నిజంలోనికి మేల్కోవటమే నీ జీవిత లక్ష్యం. అందుకే కాలాన్ని వృధాచేసుకోవద్దు. డబ్బు ఎప్పడైనా వేస్టు అయినా ప్రమాదం లేదు కాని కాలం వేస్టు అయితే మనకు మరల ఆ కాలం రాదు. అందుచేత కాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకొంటూ హృదయంలో ఉన్న నిజంలోనికి మేల్కోవటానికి ప్రయత్నం చేయండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| నవంబర్ | 2 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| నవంబర్ | 9 | క్షత్రియ కళ్యాణ మండపం, మ॥ 3 గం॥లకు |
| నవంబర్ | 23 | పాలకొల్లు, శ్రీ పెన్మెత్స సత్యనారాయణరాజు సూర్యపద్మావతి క్షత్రియ సంక్షేమ పరిషత్ కళ్యాణ మండపం |
| నవంబర్ | 27 | గొరగనమూడి జ్ఞానానంద ఆశ్రమం |
| నవంబర్ | 28 | పాతాళ మెరక |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

When I was tired and discouraged from fruitless effort
you knew how hard I have tried.
When I cried so long and my heart was in anguish
It was you who counted my tears.
When I think I have tried everything and don't know where to turn
You have the solution.
When nothing makes sense and I am confused or frustrated
You have the answer.
If suddenly my outlook is brighten and I find traces of hope
You have whispered to me.
When things are going well and I have much to be thankful for
You have blessed me.
When something joyful happens and I am filled with awe
You have smiled upon me.
When I have a purpose to fulfill and dream to follow
You have opened my eyes and called me by name.
Whereever I am and whatever I am facing
You always know.
For you are my Master, Friend, God and
foremost of all my Father whom I would like to wish :
"Happy Birthday to the birthless one,
Happy Birthday to the deathless one."

అరయన్ శంతను పుత్రుపై, విదురుపై, అక్రూరుపై,
కుబ్జపై, నరుపై, ద్రౌపదిపై, కుచేలుని పయిన్,
నంద వ్రజశ్రేణిపై బరగన్ గల్గు భగవత్
కృపారసము నాపై కొంతరానిమ్ము, నీ
చరణాబ్జమ్ములె నమ్మినాను జగదీశా
భక్త హృదయవాసా దీన రక్షకా.....
ఓ నాన్న పరమాత్మా! జిన్నూరు పుర నివాసా!
మాయ మానుష వేషధారా! ........

అందెలు ఘల్లన నందుని సతి ముందు
చిందు ద్రొక్కుచు పాడు చిన్నిగీతి
బృందావనంబున ప్రియ గోపికాంగనా
రాసలీలను పాడు రమ్యగీతి
రారాజు సభలోన రాజులు మెచ్చగా
రాగముతో పాడు రాజగీతి
అనిలోన రథమాపి అర్జున బావకు
వినిపించినట్టి ఋగ్వేదగీతి
మరల యొకమారు వినిపించు! పరమపురుష
చిక్కు వదిలించు కొందును శీఘ్రముగను
జిన్నూరు పురవాస! ప్రజలకు నీవెయాస!
ప్రణతులివె నాన్న పరమాత్మ నీకు